ప్రజాశక్తి

Vol. 5, no. 17

(Oct. 25, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 5, no. 17

(Oct. 25, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 — 0-2-0

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 5 సంచిక 17 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ ★ పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 25-10-44

● మన రాజకీయాలు ●

యు. పి. కాంగ్రెసునాయకుల తీర్మానాలు

విచ్ఛిన్నకుల ప్రచారాన్ని కాంగ్రెసువాదులెదుర్కోవాలి

●

సంయుక్తపరగణాల కాంగ్రెసునాయకులలో శ్రీ ప్రకాశ్ ఒకరు. ఆయన "పీపుల్సువార్" విలేఖరితో యిలాఅన్నారు:

"జిన్నాగారు లీగ్ ఆశయాన్ని వివరించడంలో తొక్కిన మార్గం కొందరికి యిష్టం లేకపోవచ్చు. అంతమాత్రంచేత ఆయన వుద్దేశాన్ని శంకించడం సరికాదు. ప్రస్తుత పరిస్థితులకు మూలకారణం ఏమో మనమంతా అర్థంచేసుకోవాలి. స్వయంనిర్ణయ సూత్రంయొక్క ఆధారంపై యీ సమస్యను పరిష్కరించడానికి చర్చలుసాగించడం ఎంతైనా అవసరం. పరస్పర నిందారోపణలకు తావీయకుండా, నిష్కల్మషమైన వాతావరణంలో, బహిరంగ చర్చలుజరగాలి. ఈవిషయంలో కాంగ్రెసువాదులు ముందుకువచ్చి, తమ కృషి ద్వారా దేశానికి మార్గంచూపాలి అంతేగాని, ఐక్యతను విచ్ఛిన్నం చేసేవారికి బలం చేకూర్చకూడదు."

కాని దురదృష్టవశం యు.పి.కాంగ్రెసు నాయకుల్లో అంతగా కనపడ్డంలేదు ఈనెల 10,11,12 తేదీలలో సంయుక్త పరగణాల కాంగ్రెసునాయకులు కాన్పూరులో సమావేశమై ఒక తీర్మానం చేశారు. అందులో దేశం అంతా ఏకఖండంగానే ఉండాలనీ, సార్వజనిక వోటింగుపద్ధతివి (ప్లెబిసైట్) కొన్ని ప్రాంతాలు విడిపోవాలనుకుంటే అలా విడిపోవచ్చునని, కాని అట్టి ప్రాంతాలకు సంపూర్ణమైన స్వాతంత్ర్యం ఇవ్వకుండా కొన్ని హద్దులు నిర్ణయిస్తూ కేంద్రప్రభుత్వానికి ప్రత్యేకాధికారాలు ఉండాలనీ, ఉంది. రాజాజీ ప్రణాళికను బలపరుస్తూ శ్రీగోపీనాథ శ్రీవాస్తవ ప్రవేశపెట్టిన తీర్మానం వీగిపోయింది. స్వయంనిర్ణయసూత్రం ఆధారంమీద కాంగ్రెసు - లీగ్ ఐక్యతకై ఎడతెగకుండా పనిచేసే కమ్యూనిస్టులకు "కాంగ్రెసువాదులఅసెంబ్లీ" లో స్థానం లేకుండాకూడ పైసమావేశం చేసింది.

ఈవిధంగా యు. పి. కాంగ్రెసునాయకులు గాంధిజీ వెళ్లినంతముందుకైనా వెళ్ళలేకపోయారు. సంప్రతింపులు విఫలమయాక దేశంలో వ్యాపించిన నిస్పృహ వీరిలోకూడా ప్రవేశించింది. లీగ్ ఆశయాన్ని గురించి సాధారణ కాంగ్రెసువాదుల్లో ఉన్న అపోహలు తొలగించడానికి యీ సమావేశం ఏవిధంగానూ తోడ్పడలేదు.

ఇట్టి విధానంవల్ల బలపడుతూన్న దెవరు? కాంగ్రెసు-లీగు ఐక్యతకు వ్యతిరేకంగా ఆందోళనచేసే హిందూమహాసభవారూ, యితర అభివృద్ధి నిరోధకులున్నూ, ఉదాహరణకు, సంయుక్త పరగణాల హిందూమహాసభ నాయకుల్లో ఒకడైన రావుబహద్దూర్ కున్వర్ గురునారాయణ, జిన్నాకు దేశస్వాతంత్ర్యం అక్కర్లేదని బుకాయిస్తున్నాడు. కాంగ్రెసు హిందూ - ముస్లిం ఐక్యతకోసం ప్రాకులాడ్డంలో అర్థంలేదట!

హిందూమహాసభ నాయకుల్లో ఒకడును, వైస్రాయి కార్యనిర్వాహక వర్గంలో సభ్యుడును, ఐన ఖరే యేమన్నాడో చూదాం: "కాంగ్రెసూ, ముస్లింలీగూ భారతదేశానికి పూర్తిగా ప్రాతినిధ్యం వహించే సంస్థలుకావు. ముందు ముందు కొత్త రాజ్యాంగ సంస్కరణలు రానున్నాయి. అప్పుడు యీ రెండు సంస్థలతో ప్రసక్తి లేకుండానే వాటిని ప్రవేశపెట్టాలి." ఖరే అంటే, వైస్రాయి నమ్మినబంటు. ఇతనిమాటల్లో వేవెల్-అమెరీల యుద్ధానంతరప్లాను ప్రస్ఫుటమవుతోంది. ఏమిటి ఆ ప్లాను? కాంగ్రెసును అణచివేయడం; ముస్లింలీగ్‌ను విచ్ఛిన్నమొనర్చడం; ప్రభుత్వంలోకి ఖరేవంటి తమ గులాముల్ని తోయడం; అదే ప్రజా ప్రతినిధుల ప్రభుత్వం అని చాటడం!

కె. ఎం. మున్షీ ఒకప్పుడు బొంబాయి కాంగ్రెసు మంత్రివర్గంలో ప్రముఖస్థానం అలంకరించి, అఖండ హిందుస్థాన్ ప్రచారంచేయడానికి కాంగ్రెసుసంస్థకు రాజీనామా యిచ్చిన 'నాయకమ్మన్యుడు'. అయన జిన్నాగారినిగురించి ఏమంటున్నాదో చూదాం: "జిన్నాగారు మతం మీద ఆధారపడే ఒక రాజ్యాన్ని భారతదేశంలో స్థాపించ దలచుకున్నారు. పాకిస్తాన్ రాజ్యానికి ఒకసుల్తాన్ రాజుగా ఉండాలనీ, అతడే ముస్లిం మతస్థులందరికీ నాయకుడుగా ఉంటాడనీ, జిన్నాగారి ఉద్దేశం." జిన్నాగారు ప్రజాప్రభుత్వ స్థాపనే తన ఆశయమైనట్లు ఈ నెల 4వ తేదీని "డెయిలీవర్కర్" విలేఖరితో స్పష్టంగా చెప్పినప్పటికీ, ఈ మాజీకాంగ్రెసు మంత్రి ఎలా జిన్నాగారికి దురుద్దేశాలు అపాదిస్తున్నాడో చూడండి.

మితవాద పక్షనాయకుడైన శ్రీనివాసశాస్త్రిగారు మొన్న 19వ తేదీని మద్రాసులో ఉపన్యసిస్తూ, జిన్నా భారతదేశం యొక్క రక్తమాంసాలు, కనీసం కాంగ్రెసుయొక్క రక్తమాంసాలు, కావాలంటూన్నట్లు చిత్రించారు. కాని యీ క్రిందివాక్యాలవల్ల ఆయన ఎంత కాంగ్రెసుభక్తుడో తెలుసుకోవచ్చు: "మహాత్ముని అభిప్రాయంలో, బ్రిటిష్ పరిపాలకుల్ని దేశంనుండి వెళ్ళగొట్టాలంటే జిన్నాతో రాజీ చేసుకోవడం అవసరం........కాని, బ్రిటిష్‌వారిని తొలగించాలనే పిచ్చి ఒకవ్యక్తిలో ప్రవేశించినంతమాత్రాన, ప్రజలు బ్రిటిష్ పరిపాలనను తొలగించే ప్రయత్నంలో పెద్దపెద్ద త్యాగాలు చేయడం నా కిష్టంలేదు. అట్టి ప్రయత్నంవల్ల ఇప్పుడు మనంచేసే త్యాగాలకంటె ఇంకా ఎక్కువత్యాగాలు చేయవలసి వస్తుంది." కాబట్టి శాస్త్రిగారిచ్చే సలహా ఏమిటి? రాజాజీ ప్రతిపాదనలను గాంధీజీ ఉపసంహరించుకొని, ఇక యెప్పుడూ జిన్నాతో సంప్రతించకుండా ఉండడం! అలా చెయ్యకపోతే, దేశంలో రక్తపాతం జరుగుతుందని కూడా ఈయన బెదిరిస్తున్నాడు! సామ్రాజ్యవాదుల పెత్తనం చిరస్థాయిగా ఉండడానికేగా వీరి తాపత్రయమంతా!

ఇక సిక్కుల విషయం. సిక్కులహక్కులకు భంగం వాటిల్లకుండా చూస్తానని గాంధీజీ స్పష్టంగా తెలియజేసినప్పటికీ, అకాలీనాయకులు లాహోరులో ఒక మహాసభ జరిపి, అందులో రాజాజీ ప్రణాళికకు వ్యతిరేకంగా ఆందోళన చేయాలని తీర్మానం గావించారు.

మహాత్మాగాంధీ రాజాజీప్రణాళికను ఉపసంహరించుకొని పరిష్కారప్రయత్నాలను పూర్తిగా విరమించుకోవడంఅంటే కాంగ్రెసు, లీగులు రెండూ నిరర్థకంగా పడి ఉండడమన్న మాట. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల, వారి గులాముల ఆశలు నెరవేరడమన్నమాట. శ్రీవాస్తవ తీర్మానాన్ని ఓడించడమంటే ఈపై పరిస్థితులకే దారితీయడమవుతుంది. చేతులారా ఖరేవంటి సామ్రాజ్యవాద గులాములను, శ్రీనివాసశాస్త్రివంటి మితవాద నాయకుల్ని, అకాలీలవంటి దురహంకార జాతీయవాదులను బలపరచడమవుతుంది. కాంగ్రెసు దేశభక్తులు ఈ ప్రమాదాన్ని గుర్తించాలి. చేతులు ముడుచుకు కూర్చోడానికిది సమయంకాదు! వలువైపులనుండి ప్రాకుతూన్న విషప్రచారాన్ని ఎదుర్కోవాలి. దేశ శ్రేయస్సును కోరేవారందరిని కూడగట్టుకొని, ప్రజల్లో చొరబడి, ఐక్యతా సందేశాన్ని ప్రచారం చేయాలి.

★ సంపాదకీయం

బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ మహాసభ

●

బ్రిటిషు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసులో 70 లక్షల కార్మికులు సభ్యులుగా వున్నారు. బ్రిటిషు ప్రజలలో అత్యధిక సంఖ్యాకులకు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ప్రాతినిధ్యంవహించుతుంది. కాని నాయకత్వం 'అట్లీ', 'సిట్రిన్'లవంటి మితవాదుల చేతుల్లోవుంది. ఐనప్పటికీ ఈయేడు బ్లాక్‌పూల్‌లో సమావేశమైన మహాసభ తీర్మానాలు చూస్తే, బ్రిటిష్‌కార్మికులు ప్రపంచాభ్యుదయాన్ని ఎలా కోరుతున్నారో తేటతెల్లమవుతుంది.

ఈ సమావేశం బొగ్గు, ఇనుము, ఉక్కు పరిశ్రమలను, రవాణా సౌకర్యాలను ప్రజాయత్తం చేయాలని తీర్మానించింది. మానొపలీలు, కార్టెల్సు వగైరా గుత్త వ్యాపార సంస్థలను రద్దుచేయాలని తీర్మానించింది. అనగా బ్రిటనులో ఉన్న ముఖ్యపరిశ్రమలపై, ఆర్థిక సంపత్తిపై కొలదిమంది కోటీశ్వరులకు అధికారం తొలగించి, ప్రభుత్వపరం చేయాలని నిర్ణయించారు. ఈవిధంగా వారు బ్రిటనులో ప్రజాప్రభుత్వ స్థాపనకు ముందంజవేస్తున్నారు.

మన దేశభక్తులలో సాధారణంగా ఒక అపోహ వుంది. బ్రిటిష్ కార్మికోద్యమం పైకి ఎన్నిమాటలు చెప్పినా, వాస్తవంలో వలసదేశాల సమస్య వచ్చేటప్పటికి సామ్రాజ్యవాదుల పాలసీనే అనుసరిస్తుందని వాదించుతారు. చర్చిల్ - అమెరీ వంటి సామ్రాజ్యవాదులు, వారి అనుచరులైన అట్లీ ముఠాఅవలంబించే పంథాకూ, బ్రిటిషుకార్మికసామాన్యంయొక్క పంథాకూ, మధ్యవున్న భేదాగ్రహించరు. ఈఅభిప్రాయం సరియైనది కాదని బ్రిటిష్‌ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు భారతదేశం విషయమై చేసిన తీర్మానం రుజువుచేస్తుంది.

భారతదేశంలోని రాజకీయఖైదీలందరినీ వెంటనే విడుదలచేయాలని అది కోరింది. భారతకార్మికుల స్థితిగతులను పరిశీలించడానికి ఒకప్రతినిధివర్గాన్ని పంపి, ఉభయ కార్మికోద్యమాలమధ్య సన్నిహితసంబంధం ఏర్పరచాలని తీర్మానించింది. భారత ప్రజానాయకులు పరస్పరం ఒడంబడిక చేసుకొని, ఐక్యతను నిర్మించాలని కోరింది.

బ్రిటిషు కార్మికులు భారత రాజకీయ ప్రతిష్టంభనను తొలగించాలని తమ ప్రభుత్వంపై ఎలా ఒత్తిడిచేస్తున్నారో యీ తీర్మానం తెలియజేస్తుంది. కొందరు దేశభక్తులు అపోహపడుతున్నట్లుగా, బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ఇండియామంత్రి పాలసీ బలపరచలేదు. అమెరీ రాజకీయఖైదీలను విడుదలచేయ నిరాకరించుతున్నాడు. విడుదలచేయాలని కార్మికమహాసభ డిమాండు చేసింది.

ఈసమావేశంలో భారతట్రేడ్‌యూనియన్‌కాంగ్రెసు అధ్యక్షుడైన కామ్రేడ్ డాంగే మాట్లాడటానికి అవకాశమివ్వనిమాట నిజమే. అచటి అభివృద్ధి నిరోధకులు 'డాంగే' ప్రతినిధికాడని అభ్యంతరం పెట్టారు. దీన్ని చూచి మనం బ్రిటిషు కార్మికోద్యమాన్నే నిందించరాదు. కామ్రేడ్ 'డాంగే'ను బ్రిటనులోని కార్మిక సంఘాలన్నీ ఆహ్వానించాయి. సభలు ఏర్పాటుచేశాయి. ఇండియాప్రభుత్వ ఏజెంట్లుగా వెళ్లిన రాయిస్టులను బట్టబయలుచేశాయి. ఇదంతా ఏమి తెలుపుతుంది? బ్రిటిషు కార్మికులు, ప్రజలు భారత స్వాతంత్ర్యానికి వ్యతిరేకులుకారు; అనుకూలురు.

తమదేశంలో వారు సామ్రాజ్యవాదులతో పోరాడుతున్నారు. ఇచట మనదేశంలో భారతస్వాతంత్ర్యం కోరేవారంతా తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలి. గాంధీ-జిన్నాలు తిరిగి సమావేశం కావడానికి దేశభక్తులంతా పనిచేయాలి. అప్పుడే బ్రిటిషుప్రభుత్వాన్ని తొలగదీయడం సులభసాధ్య మవుతుంది.

ప్రజలే తమభవిష్యత్తు కధినాధులు

గ్రీసు దేశపు ఉజ్వలగాథ

మూడేళ్ళనాటి మాట. చిన్న దేశంకదా — సులభంగా మింగేద్దామని ముసోలినీ మూక గ్రీసుపై ఉరికారు. చేప అని చేయివేస్తే మొసలై పట్టుకుందన్నట్లు గ్రీకు ప్రజలు ఈ దోపిడీ మూకను ముప్పతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ళుత్రాగించారు. గ్రీసు పొలిమేరలనుంచివాళ్లనుతరిమికొట్టడమే కాకుండా, అల్బేనియాలోకికూడా ప్రవేశించారు. తోడిదొంగ హిట్లరు ముసోలినీకి సాయం రావలసివచ్చింది. వచ్చి స్వాతంత్ర్య కాముకులైన గ్రీసుప్రజలపై దెబ్బతీశాడు.

1941 ఏప్రిల్ 27 వ తేదీని ఏథెన్సు మహానగరంపై నాజీపతాకాన్ని ఎగురవేశాడు. రెండు ఫాసిస్టుశక్తులు తమ ఇనుపపాదాలక్రింద గ్రీసును నలగద్రొక్కాయి.

ఆ గ్రీసు నేడు తనస్వాతంత్ర్యాన్ని తిరిగి సాధిస్తూంది. గ్రీకు దేశభక్తులు తమ రాజధాని, ఏథెన్సును 14వ తేదీన నాజీచెరనుండి విడిపించారు. ప్రపంచంలోని స్వాతంత్ర్యకాముకుల జేజేలందుకున్నారు. మూడేళ్ళుగ తమపై స్వారీచేస్తూన్న నాజీదుష్ట గ్రహాలను గ్రీకు దేశభక్తులెలా వదగొట్టగలుగుతున్నారు? ఈ మూడేళ్ళ కథేమిటి?

●

గ్రీసు పతనానంతరం తప్పించుకుపోయిన జార్జిరాజు తన మంత్రివర్గంతో లండను హోటళ్లను చేరుకున్నాడు. కాని ప్రజాసామాన్యం ఎక్కడికి పోగలదు? తమసర్వస్వం గ్రీసే. గ్రీసులోనే నిలిచారు. అంతేకాదు. తమమాతృదేశ స్వాతంత్ర్యాన్ని తిరిగి సాధించడానికి కంకణంకట్టారు. నాజీలు ఆక్రమించుకున్న నెలరోజుల్లోనే గ్రీసులో స్వాతంత్రోద్యమం తలచూపింది. ఇ. ఏ. యమ్. అనేసంస్థ దీనికి నాయకత్వంవహించింది. జాతీయస్వాతంత్ర్య సంఘటన ఇది. రైతుపార్టీ. యూనియన్ ఆఫ్ పాపులర్ డెమాక్రసీ. సోషలిస్టుపార్టీ. కమ్యూనిస్టుపార్టీ మొదలైన పార్టీలూ. గ్రీసులో కల్లా బలవత్తరమైన ట్రేడ్‌యూనియన్ ఫెడరేషనూ. రైల్వే కార్మికసంఘం. వివిధ యువజన. మహిళాసంఘాలూ — ఇవన్నీ ఇందులో చేరాయి. కొద్దికాలంలోనే ఈ సంస్థ బ్రహ్మాండంగా పెరిగింది. ‘ఎలాస్’ అనే పేరుతో ఒక సైనికశాఖనుకూడా ఇది స్థాపించింది. ఈ శాఖలో 1,40,000 మంది ఉన్నారు. కాని వీరిలో 40,000 మందికి సరిపడే ఆయుధాలు మాత్రమే ఉన్నాయి.

అద్వితీయ విజయాలు

ఈ జాతీయ స్వాతంత్ర్య సంఘటన తన సైనికశాఖతో కలిసి సాధించిన విజయాలు అద్వితీయాలు. 1942లో సమ్మెలు నడిచింది. వాటితో ఏథెన్సు నగరంలో జీవనాడులన్నీ స్తంభించి పోయాయి. తమ యుద్ధసన్నాహాలకోసం జర్మనులు గ్రీకు కార్మికులను వశీకరించ సాగారు. 1943 మార్చిలో జనరల్ సమ్మె సాగించి ఇ. ఏ. యం. దీనిని ప్రతిఘటించింది. దానితోపాటు బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిపింది. ఏథెన్సు నగర వీధుల్లో 2 50,000 మంది ఊరేగి జర్మన్ చర్యలను ఖండించారు. చచ్చినట్లు జర్మన్లు తమ చర్యలను ఉపసంహరించుకున్నారు. 1943 జూన్, జూలై మాసాల్లో జరిపిన జనరల్ సమ్మెలలో 3 లక్షలమంది ఏథెన్సు ప్రజలు వీధుల్లోకివచ్చి నాజీలను, బల్గేరియా సైనికుల్ని ఎదిరించారు.

రాజధానిలోని ప్రదర్శనలు ఇలా ఉండగా, దేశంలో ఇతరచోట్ల ఇ. ఏ. యం గెరిల్లా పోరాటాలు సాగించింది. బయట నుంచి సహాయం అవంతయినా లేదు: ఆయుధాలయినా చాలినన్ని లేవు. అయినా, అచంచల స్వాతంత్ర్యదీక్ష వీరి నెంతటి సాహసానికయినా పురికొల్పింది. అల్బేనియా సరిహద్దు నుండి కోరిన్తు సముద్రంవరకుగల యావత్తు ప్రదేశాన్ని విముక్తి పరిచారు. ఇంకా అనేక ప్రదేశాలు పేరుకు జర్మన్ల అధీనంలో ఉన్నా, నిజానికి ఇ. ఏ యం; ఎలాస్‌ల అదుపాజ్ఞల్లోనే ఉంటున్నాయి. ప్రజాస్వామ్య సూత్రాలపైని ఎన్నుకోబడిన కౌన్సిళ్లద్వారా ఈప్రాంతాల ప్రజలందరూ శక్తికొలది స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటున్నారు. ఆక్రమిత యూరప్ అంతటా ఇంతకన్న ఉత్తేజకరమయిన ప్రజాపోరాటం ఎక్కడా సాగలేదు. నిజంగా ఇ. ఏ యం. ధన్యచరిత.

రాజుగారి కుట్రలు

ఈవిధంగా ప్రజల నందరిని స్వాతంత్ర్య బావుటా క్రింద సమీకరిస్తూ, ప్రజాస్వామ్య సూత్రాలపై గ్రీసును పునర్నిర్మించడానికి కృషి చేస్తూంది ఇ.ఏ.యం. సంస్థ. లండను హోటళ్లలో విందులారగిస్తూన్న జార్జి (గ్రీసు) రాజుకి, అతని మంత్రివర్గానికి ఇది కంటిలో నలుసయింది. దాని నెలాగయినా రూపుమాప సంకల్పించాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాద ముఠా అతనికి మద్దతు నిలిచింది. మొట్టమొదట గ్రీసు స్వాతంత్ర్యోద్యమాన్ని గురించి వార్త లేమీ పైకి పొక్కనివ్వలేదు. ఆతరువాత, అక్కడ జరుగుతున్నదంతా ఎలాస్ (ఇ. ఏ యం. సైనికశాఖ) కు "ఈడెస్" అనేముఠాకు మధ్య అంతఃకలహమే అని విషప్రచారం చేశారు.

ఈ సందర్భంలో ఒకవిషయం తెలుసుకోవాలి. గ్రీసులో ఈడెస్, ఎక్కా అని మరి రెండు సంస్థలు, తామూ స్వాతంత్ర్యసమరానికే అంటూ బయలుదేరాయి. ఎక్కా బలం వేయిమంది మాత్రమే. కాని 1943 వేసవిలో వీరిలోఎక్కువభాగం ఎలాస్‌లో చేరిపోయారు. అప్పటినుండి ఎలాస్‌కు, ఎక్కాకు సన్నిహిత సంబంధం ఉంది. కాని ఈడెస్ సంగతివేరు. దీని నాయకుడు కర్నల్ జెర్వాస్. యుగోస్లావియాలో మిహైలోవిచ్ ఎలాంటిద్రోహో గ్రీసులో ఇతనలాంటి ద్రోహి. ఇ. ఏ.యం.. ఎలాస్‌ల నాయకత్వాన నానాటికి అభివృద్ధిపొందుతూన్న గ్రీకు ప్రజాపుద్యమాన్ని అరికట్టడానికి జార్జి రాజు దీనిని సాధనంగా ఉపయోగింపజూచాడు. దీనిబలం ఎప్పుడూకూడా 3000కు మించలేదు. (1944 మార్చినాటికి ఈ బలం 1 500 కు తగ్గింది.) అయినా లండనులోని గ్రీకు ప్రభుత్వం ఆయుధాలన్నీ దీనికే సప్లయిచేసింది. నిజంగా గ్రీసు స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్నసంస్థ ఇదేనని, ఎలాస్ దీనిపై కత్తికట్టి శత్రువులకు తోడ్పడుతూందని ప్రచారం చేసింది. చర్చిల్‌కూడా ఒకసారి పార్లమెంటులో ఉపన్యసిస్తూ ఈ ప్రచారానికి ప్రక్కాకాశం వేశాడు: కాని రెండో ఉపన్యాసంలో తనతప్పు దిద్దుకున్నాడు. ఇక ఈ జెర్వాస్, అతని ఈడెస్, చర్యలు ఎంత ద్రోహకరంగా ఉండేవో, ప్రజలు వారినెంత అసహ్యించుకొనేవారో చెప్పడానికి ఒక్కనిదర్శనం చాలు. ఈసంవత్సరం ప్రారంభంలోకొన్ని ప్రాంతాల్లో ఉన్న ఈడెస్‌దళాలను అక్కడి ప్రజలే నిరాయుధులనుచేసి, అరెస్టుచేశారు. జెర్వాస్‌ను, ఎడావిగావాడి ప్రధానకార్యాలయంగా ఉండిన వాల్టోస్‌నుంచి తరిమిగొట్టారు.

సైనికులలో చైతన్యం

ఈడెస్‌ని ఉపయోగించుకొని గ్రీసు ప్రజా ఉద్యమాన్ని అణగగొట్టాలనుకొన్న జార్జిరాజు ఆశ తలవిధంగా అడియాస అయింది. దానితో మరో ఎత్తువేశాడు. మధ్యధరాసముద్ర ప్రాంతంలో ఉండిన గ్రీసు సేనను పునర్నిర్మించ పూనుకున్నాడు. రాజూ అతని అనుచరులూ. నాజీలతో యుద్ధంచేయడానికాదీ పునర్నిర్మాణం. యుద్ధానంతరం, శాంతిభద్రతలను కాపాడడం అనేమిషతో గ్రీసులోని ప్రజా



— గ్రీసు గెరిల్లా యోధుడు —

ఉద్యమాన్ని అణగగొట్టడంకోసం. కరడుగట్టిన ఫాసిస్టు అనుకూలురను ఈ సేనలకు అధిపతులుగ నియమించారు. ఫాసిస్టు వ్యతిరేక చైతన్యం. ఇతర రాజకీయచైతన్యం సైనికులకు సోకకుండా కట్టుదిట్టాలు చేశారు. ఎంతచేసినా లాభం లేకపోయింది. 1942 చివరభాగంలోను. 1943 మార్చి. జూన్ అప్రాంతాల్లోను చాలమంది గ్రీసుప్రజలు నాజీదారినుండి తప్పించుకొని ఈ ప్రాంతాలకు వచ్చారు. ఇ ఏ. యం , ఎలాస్‌ల ప్రచారం సోకినవారే వీరంతా.

వీరు గ్రీకు సేనల్లో చేరారు. చేరినదగ్గర్నుంచి ఫాసిస్టు వ్యతిరేక భావాలను వెల్లడిచేస్తూ, ఫాసిస్టు అనుకూల అధికారులను తొలగించాలని ఆందోళన ప్రారంభించారు. అంతటితో ఆగలేదు. ప్రజలకు ప్రాతినిధ్యం వహించగల ప్రజాస్వామ్య ప్రభుత్వం కావాలనికూడా ఆందోళన చేయసాగారు.

గ్రీకు సేనల్లో ఈ ఆందోళన చాలచైతన్యం కలిగించింది. 1943 మార్చిలో ప్రభుత్వం ప్రజాస్వామ్య భావాలుగల ముగ్గురు అధికారులను తొలగించేసరికి సైనికులంతా తిరుగుబాటు లేవదీశారు. అభివృద్ధి నిరోధక అధికారుల నందరినీ అరెస్టుచేశారు. ప్రభుత్వానికి హడలు పుట్టింది. తక్షణం ఫాసిస్టు అనుకూల అధికారులను తొలగించింది.

ముసిపూసి మారేడుపండు చేయబోయి —

రాజకీయంగాకూడా సైనికుల కళ్ళు తుడవబోయాడు రాజు. ఎవరో కొందరు మితవాదులను తన మంత్రివర్గంలో చేర్చుకొని, దానినే ప్రజాస్వామిక ప్రభుత్వంగా పరివర్తించబోయాడు. కాని యెవరూ బుట్టలో పడలేదు. 1943 జులైలో మరో సైనిక తిరుగుబాటు జరిగింది. ఈజిప్టుతీరంలో ఉన్న గ్రీకు నౌకాదళాలకుకూడా అది పాకింది. దీనిని అణచడానికి బ్రిటిషు సేనలు వచ్చాయి.

‘రాజు రాకూడదు’

సైన్యంలో ఈ చైతన్యమూ, అటు గ్రీసు దేశంలో నానాటికి అభివృద్ధి పొందుతూన్న ప్రజాపుద్యమమూ చివరకు రాజును, అతని అనుచరవర్గాన్ని లొంగదీయ నారంభించాయి. 1943 జులైలో రాజు ఒక ప్రకటనచేశాడు. మిలిటరీ పరిస్థితులు అనుకూలపడ్డ తరువాత ఆరునెల్లకు కాన్‌స్టిట్యుయన్ట్ అసెంబ్లీకి (ప్రజాపరిషత్తుకు) ఎన్నికలు జరిపిస్తాననీ, గ్రీసు విమోచన పూర్తికాగానే కొయలిషన్ (సంయుక్త) మంత్రివర్గాన్ని యేర్పాటుచేస్తానని ప్రకటించాడు. దీని అర్థం రాజు తిరిగి సింహాసనం ఆక్రమించుకొని, ఆ తరువాత తనకు నచ్చినప్పుడు ఎన్నికలు పెడతాడన్నమాట. కాని, రాజు తిరిగి దేశంలో అడుగు పెట్టడానికి ప్రజలందరూ వ్యతిరేకం. ఈ ప్రకటన జరిగిన ఒకనెలకు ఇ. ఏ. యం. ప్రతినిధులు కైరోవెళ్ళి ప్రజల కోరికలను రెండిటిని రాజుగారికి తెలిపారు. రాజు తిరిగి దేశానికి రావడమా. కూడదా అనేవిషయాన్ని ప్రజానిర్ణయానికి విడిచిపెట్టాలన్నది మొదటి కోరిక రెండోది, తాత్కాలికంగా జాతీయ పక్షాల సంయుక్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని. వీటికి జవాబు చెప్పక రాజు లండనుకు తిరిగి వెళ్లాడు. అక్కడనుంచి ఇ. ఏ. యం. మీదవిషప్రచారంప్రారంభించాడు. ఇందులో శత్రువులను కూడా మించిపోయాడు.

కాని, ఏమీ లాభం లేకపోయింది. గ్రీసు ప్రజాపుద్యమం, అభివృద్ధికర శక్తుల నన్నిటిని కూడగట్టుకొని, పురోగమించింది. 1944 మార్చిలో గ్రీసులో ‘జాతీయ స్వాతంత్ర్య రాజకీయ సంఘం’ ఏర్పాటయింది. స్వాతంత్ర్యం కోసం పోరాడుతూన్న రాజకీయ, మిలిటరీ సంస్థ లన్నిటియొక్క ఐక్య సంఘమిది. ఏర్పడిన వెంటనే మిత్రమండలికి పూర్తి సహకారాన్ని వెల్లడిచేస్తూ అమెరికా, బ్రిటను, సోవియట్ ప్రభుత్వాలకు సందేశం పంపింది. జాతీయ సంయుక్త ప్రభుత్వాన్ని గురించి తమ కోరికను కూడా నొక్కి చెప్పింది

కుట్రలన్నీ విఫలమయాయి

మార్చి 25 వ తేదీ గ్రీసు స్వాతంత్ర్య దినము. ఆనాడు ఈజిప్టులోని గ్రీకు ప్రజలు, సైనికులు, సైనికాధికారులు, నావికులు, నావికాధికారులు - అందరూ ప్రదర్శనలు జరిపి ఈ కోరికనే చాటారు. మరి కొద్దిరోజులకు, కొందరు ఉన్నత సైనికాధికారులు గ్రీకు ప్రధానివద్దకువెళ్లి ‘ఈ కోరికను స్వీకరించు, లేదా రాజీనామా ఇవ్వు’ అని కోరారు. వారిని అరెస్టు చేయించాడతను. కాని, అక్కడున్న సైనికులు వారిని విడిపించారు. వెంటనే గ్రీకు అధికారులు విరుచుకుపడ్డారు. ఇ. ఏ. యం. అంటే సానుభూతి ఉన్నవారి నందరిని అరెస్టుచేయ సాగారు. దీనికిజవాబుగ యావత్తుసైన్యం సమ్మెచేసింది. రాజు లండను నుంచి ఎగిరివచ్చి, సైన్యాన్నంతటినీ రద్దుచేయసాగాడు. ఇంచుమించు సైన్యాన్నంతటినీ అరెస్టుచేయించాడు. ఇందుకు ఇతరుల సహాయంకూడా పొందాడు. అదే సమయంలో బ్రిటనులో గ్రీసునావికులు, నావికాధికారులు కూడా తమజాతీయవాంఛను వెల్లడించసాగారు. గ్రీకు రాజుకి, అతని సామ్రాజ్యవాదముఠాకు ఎటుచూచినా ఆస్కారం లేకపోయింది. లెబనాన్ సమావేశం (మే) లో చిట్టచివరి (మిగతా 6 వ పేజీలో)

మహాకవి - మహాపురుషుడు గురుజాడ అప్పారావు

— సి. ఈశ్వరారావు

ఉద్ధాహాపూరిత కళానృష్టికన్నా, జీవిత సృత్యాల్ని, సమస్యల్ని కళారూపాల్లో పెట్టడానికి, కళాకారుడికి మానవజీవితాన్ని పరిపాలిస్తున్న వివిధశక్తుల విషయ పరిజ్ఞానం విశేషంగా వుండేనేకాని సాధ్యంకాదు. ఇది ‘కళ కళకోసమే’ అన్న సిద్ధాంతంగల రచయితకు అనవసరం. ఇతర హంగులకోసం యితడు శాస్త్రీయపదజాలాన్ని గాని, జీవితంతోను జీవితంపై ప్రభుత్వం చేస్తున్న యితర శక్తులంతోను తోక్కం కలుగజేసుకోడు. కళ కళకోసమే అని ప్రాకులాడి, జీవితానికి వెన్నుచూపని, కళాకారుడువిటివివృదయస్థం చేసుకోవడమేకాకుండా, కళారూపంలో వెల్లడించాలి. అందుచేతనే యితనివని చాల కష్టమైనది. అట్టి ఎరుడువనికి పూనుకొని సమర్థతతో నిర్వహించి తెలుగుసాహిత్యంలో విప్లవకరమైన మార్పులు తెచ్చిన మహాకవి, గురుజాడ అప్పారావు.

కాలాన్ని అతిక్రమించిన సాంప్రదాయాలను - సంకెళ్ళుగా పరిణమించిన పాత సాంప్రదాయాలను త్రెంచుకుని, తెలుగు సాహిత్యానికి నూతన చైతన్యాన్ని, నూతన స్వాతంత్ర్యాన్ని, నూతన వికాసాన్ని ప్రసాదించిన మహాకవి, గురుజాడ అప్పారావుగారు.

"ఆకులందున అణగి మణగి
కవితకోకిల పలుకవలెనోయి
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలె నోయి."

సాధారణంగా హృదయోన్నత్యం గలవారికి బాహ్యాడంబరం తక్కువగా వుంటుంది. దీన్నే వ్యక్తంచేస్తుంది అప్పారావుగారు పాడిన వైగేయం. దేశమందభిమానములు మొలకెత్తించాలికవితా కోకిలపలుకులు — అదీ అప్పారావు గారి కవితాదర్శం!

నిరాడంబరత్వం, సౌందర్యం

ఆయన కవిత్వం యెంత నిరాడంబరంగా నుంటుందో అంత - సమర్థుని బాణంలాగ - సూటిగావచ లక్ష్యాన్ని చేరుతుంది. నిరాడంబరత్వంలో సౌందర్యాన్ని సృష్టించడం ఆయన కవిత్వస్వభావం.

"మేలిమి బంగరు మెలతల్లారా!
కలువల కన్నుల కన్నెల్లారా!
తల్లులగన్నా పిల్లల్లారా!
విన్నారమ్మా యీ కథను.
"ఆటలపాటల పేటికలారా!
కమ్మనిమాటల కొమ్మల్లారా
అమ్మలగన్నా అమ్మల్లారా!
విన్నారమ్మా మీరీకథను!
("పూర్ణమ్మ")

జీవితాన్ని వదులుకొని, కళంకంబేమేహాల మీద పునాదులువేసి కట్టినగాలి మేడలమకొనే కృత్రిమ జీవులను —

"కొయ్యబొమ్మలె మెచ్చుకన్నుకు.
కోమలుల సౌరెక్కునా?"

అని ప్రశ్నిస్తున్నారు మహాకవి.

మానవజీవితం ఒక యెడతెరపిలేనియాత్ర. దాని లక్ష్యం దిగ్మండలానికివలె అంతులేనిది. కమకవే మానవుడు నిరంతర పురోగామి. శిఖరాన్ని చేరేమగడా అని చెట్టుమొదలు వరకడానికి, ప్రయత్నించే అత్మర్యంపకులు కృతఘ్నుతూ, మానవరూపంతోవున్న బుంటె వరో?

ఈ వత్యాన్ని అవగతంచేసుకొన్న మహాకవి అప్పారావుకు సాతంతా రోతగాదు, క్రొత్తంటా వెత్తకాదు. అని

"క్రొత్తపాతల మేలి కలయిక
క్రొమ్మెరుంగులు జిమ్మగా"

తేసైనమాటలు కూర్చుకొని ముత్యాల సరాలతో తెలుగు సరస్వతిని అలంకరించేరు. అనాడే —

"వెలుగునీటను గ్రుంకె చుక్కలు;
చదలచీకటి కదలబారెను
యెక్కడనో ఒకవెల్లుమాటున
నొక్కకోకిల పలుకసాగెను."

వీరేశలింగం ప్రభావం

ఆంధ్రసమాజజీవితంలో వీరేశలింగంగారు అద్వితీయ పురుషులైనారు. మేధావంతులనేకులను వారి ఉద్యమం ఆకర్షించింది. గురుజాడవారు సైతం ఆకర్షితులైనారు.

వీరేశలింగంగారిని గురించి అప్పారావుగారిలా రాస్తున్నారు:

"వీరేశలింగం వందితుడు - నిశ్చయముగా మహాపురుషుడు. సాహిత్యములో ఒకశాఖ చేసి, సంఘములో పురోభివృద్ధిసంఘా లేవదీసినాడు." (12-1-1911 దినచర్య)

సంఘ పురోభివృద్ధికి సాహిత్యాన్ని, సాధనంగాచేసిన వీరేశలింగంగారంటే అప్పారావుగారికి చాలా భక్తిభావముండేదని మా గురువులూ, అప్పారావుగారి ప్రియశిష్యులూ ఆయిన శ్రీ శ్రీ. డాక్టరు బుర్రా శేషగిరిరావు గారు చెప్పుతుండేవారు. ఒక మహాపురుషుని జీవితం యింకొక మహాపురుషుణ్ణి ఆకర్షించిందంటే ఆశ్చర్యమేముంది?

నాది ప్రజల ఉద్యమం

సంఘ పురోభివృద్ధి సాహిత్యానికి పరమార్థమని నమ్మిన అప్పారావుగారికి నాటి సాహిత్యధోరణి కాలానుగుణంగా లేకపోవడమేకాకుండా, అభివృద్ధినిరోధకంగా వుండని స్పష్టపడింది. వ్యవహారిక భాషాపుద్యమం, అప్పారావుగారికి సాహిత్య సంస్కరణోద్యమం మాత్రమే కాదు.

"నాది ప్రజల ఉద్యమము. దానిని ఎవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను" అని తమ ఆదర్శాన్ని 1911 మార్చి 27 వ తేదీ దినచర్యలో రాసుకున్నారు. వ్యవహారిక భాషాప్రయోజనాలు అశేషమైనవనీ, అదినాటిసంఘవ్యవస్థను, ఇంగ్లీషు ప్రభుత్వాన్ని కదిల్చివేస్తుందనీ, కన్యాశుల్కం రెండవ కూర్పు పీఠికలో అప్పారావుగారు రాశారు. ప్రజలఉద్యమమని యీనాడు రుజువైన వ్యవహారికభాషా ఉద్యమ స్వభావాన్ని అర్థశతాబ్దం క్రితం స్పష్టంగా చెప్పగలిగిన ఆలోచనాపరుడు అప్పారావుగారు, ఆ మహోద్యమాన్ని. "ఎవరినిసంతోషపెట్టడానికైనా నావదులుకోలేని" దీక్షాపరుడైన ప్రజాభిమాని అప్పారావుగారు.

ఆనాడు వ్యవహారికభాషను చేపట్టడమంటే కొరివితో తలగోకుకోవడం వంటిది. ప్రబలులైన పండితులతో, తిరుపతి వేంకటకవులు, మహా కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, శ్రీ రాముల సచ్చిదానందశాస్త్రి, వావిలకొలను సుబ్బారావు, భోగరాజు నారాయణమూర్తి గార్ల వంటివారు వీరంగా తూలనాడుతున్నా, అప్పారావుగారు తాము రెచ్చిపోయి వారి స్థాయికి దిగకుండా తమ సహజ సౌమ్యతతో ప్రతికక్షులకు నొప్పికలిగించని విధంగా జవాబులిచ్చేవారు. వ్యవహారికాన్ని దూషించడానికి దానివారి భాషలోనే దోషాలుచూపి, గ్రాంథిక భాషలో ఆటువంటి పండితులు సైతం తప్పులుగడతరు వ్రాస్తున్నపుడు సామాన్యుల మాటేమిటని ప్రశ్నించేవారు. తన పరమ మిత్రులైన గిడుగురామమూర్తితో కలిసి గ్రాంథికవాదులను చివరివరకు ఎదిరించి పోరాడి తమ ఆదర్శాన్ని స్థాపించుకోగల్గారు.

‘కన్యాశుల్కం’

వాదోపవాదాలవల్ల కార్యాలు జరగవని అప్పారావుగారు గ్రహించేరు. నడిచేసి చూపి తమ ఆదర్శాన్ని స్థాపించుకోవలెనని నిశ్చయించుకున్నారు. దాని ఫలితమే ‘కన్యాశుల్కం’

"సంఘ సంస్కరణోద్యమాన్ని బలపర్చడానికి తెనుగుభాష నాటకరంగానికి అనుకూలమైనది కాదను అపవాదు నెదుర్కొడానికి నేను కన్యాశుల్కాన్ని వ్రాసేను."

(కన్యాశుల్కం రెండవకూర్పు పీఠిక)

కన్యాశుల్కం రచనకు పురికొల్పిన పరిస్థితులను గురించి మొదటి కూర్పు పీఠికలో అప్పారావుగారిలాగచెప్పారు.

"ఈలెక్కలప్రకారంజేసిన పెళ్లిళ్ల (కన్యాశుల్కపు) సంఖ్య ఒకవెయ్యిమువ్వయినాలుగు. వగటునసంవత్సరానికి మూడువందలమువ్వయినాలుగు శుల్కవివాహాలు జరిగేయన్నమాట. తొంభై తొమ్మండుగురు బాలికలు ఐదేళ్ళప్పుడు, నలభైనలుగురు నాలుగేళ్లప్పుడు, ముప్పయి ఆరుగురు మూడేళ్ళప్పుడు, ఆరుగురు రెండేళ్ళప్పుడు, ముగ్గురు ఒకయేడాది వయసున్న వివాహితలయ్యేరు. ఒక ఏడాది వయసున్న వివాహితలైన బాలికలకు ఒక్కొక్కతెకు 350 నుండి 400 రూపాయలవరకు శుల్కం పుచ్చుకోబడింది. వింతగా కనిపించవచ్చును, కాని కడుపులోవున్న పిల్లలకోసం సైతం అప్పుడప్పుడు బేరాలు జరిగేవి.

"ఈ నీచమైన పరిస్థితులు సంఘానికి కళంకం. ఇటువంటి దురాచారాలను బయలుపెట్టి, ఉన్నతనైతికభావాలను ప్రచారం చెయ్యడంకంటె ఉత్కృష్టప్రయోజనం సాహిత్యానికుండదు. ప్రజాసామాన్యంలో పుస్తకాలు చదవడం అభ్యాసమయ్యేవరకూ, యిటువంటి సత్ఫలితం నాటకరంగంనుండి మాత్రమే ఆశించవలసి వుంది." (1-1-1897)

అప్పారావుగారు - సాహిత్యం

అప్పారావుగారికి సాహిత్యం అవశ్యాచరణీయమైన పరమధర్మం. సాహిత్యం ఆయనకు మానవసేవా సాధనం. అందుకే —

"యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయి!" అనీ,
"దేశాభిమానం నాకుకద్దని
ఒట్టిగొప్పలు చెప్పుకోకోయి
పూని యేదైనాను ఒకమేల్
కూర్చి జనులకు చూపవోయి." అనీ

ఎలుగెత్తి ఘోషించగల్గేరు.

అప్పారావుగారి అభిరుచులు, కార్యదీక్ష యే విధంగా రూపొందుతూ వచ్చేయో ముత్యాలసరాల కూర్పు వివరపరుస్తుంది

"ఒకసారి మనోహరమగు ప్రేమ పాటపాట ఒకటి అప్పారావు చెవినిబడి మనసున క్రొత్తసంగీతము తిరుగగా, తెనుగున ఒక క్రొత్త ఛందము నడిపింపవలెనని సంకల్పముదయించెను. 1910 లో బరంపురమున జరిగిన నానావర్ణ సహపంక్తి భోజనముకో అప్పారావు పాల్గొనినారు. ఆసంవత్సరమే తోకచుక్క (Hally's comet) పొడిచినది. ఒక విచిత్రమైన భావమథనమున అప్పారావు రసికచిత్తమునమండి ఒక క్రొత్త కవితావేశము రూపుకట్టినది."

(ఆంధ్రవిజ్ఞాన సర్వస్వములో కొంపెల్ల జనార్దనరావుగారు)

వర్ణవ్యవస్థకు ధిక్కారం

నానావర్ణ సహపంక్తిభోజనముతో పాల్గొని వర్ణవ్యవస్థను ధిక్కరించిన అప్పారావుగారు:

"ఎల్లలోకము లొక్క ఇల్లై
వర్ణభేదము లెల్ల కల్లై
వేల నెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియ.
"మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును
అంత స్వర్గసుఖంబులన్నవి
యవని విలసిల్లున్"

అని అనాడే పాడగలిగేరు.

తోకచుక్క, లోకారిష్టసూచకమని జడుసుకొని యితరులను జడిపించే మూఢులను చూచి —

"తెగులు కరవని కలవన్నా
దిగులు చెందు టదేటికార్యము!
తలకువేనిది సంఘసంస్కర
ణ ప్రయాణ పతాకగాన్."

అని మూఢాభిప్రాయ నిరసనాన్ని, సంస్కరణాభిమానాన్ని వెల్లడించేరు.

మన వర్ణధర్మాల్లోని అక్రమాన్ని చూపిస్తున్నారు అప్పారావుగారు:

మాలకులం ఎలాగు ఏర్పడింది?

"మలినవృత్తులు మాలవారిని
కులము వేర్పిన బలియురొక దే
శమున కొందరి వెరికిదోసిరి
మలినమే మాల."

కులంగలవారెవరు?

"కులమురేదట ఒక్కపేటున
వసరముల హింసించువారికి;
కులముగలదట వరుసబ్రేవెడి
క్రూర కర్ములకున్."

మన వర్ణధర్మ మెంత అధర్మమైనది!

"మలినదేహుల మాలలనుచును
మలినచిత్తుల కధికకులముల
నెలవొసంగిన వర్ణధర్మ
మధర్మ ధర్మంబే" ("లవణరాజుకల")

మతసామరస్యం గురించి మహాకవి ప్రబోధం:

"చెట్టపట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడువవలెనోయి.
అన్నదమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి.
"మతం వేరైతే యేమోయి?
మనసులొకటై మనుషులుంటే...."

దేశం అంటే ఏదో ప్రార్థన చేయతగిన దేవతామూర్తి అని గాకుండా —

"దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్!"

అని అప్పారావుగారు హెచ్చరిస్తున్నారు. ఈనాడు కరువుకాటకాల కాటుకి అసువులు లక్షలాది ప్రజలవేపు కన్నుత్రిప్పమని దేశభక్తులను హెచ్చరిస్తూంది అప్పారావు ప్రబోధం, దేశభక్తి అంటే అర్థమేమిటో బోధిస్తున్నారు. అప్పారాయ మహాకవి.

"తూర్పు బల బల తెల్లవారె" దుష్టశక్తులు పతనమవుతున్న యీ ఉషఃకాలంలో విద్యావాక్కుగల అప్పారాయ మహాకవితో గొంతుక కలపండి:

"దించులంగరు దీర్ఘయుద్ధం
ధర్మవశము ముల్లుమూసెను
వరుల పీడను పెంటపోకల
వాటివెలయును శాంతివృక్షము.
"పాతపండులు పాతిపెట్టుము
యుద్ధములకవి ఉనికిపట్టులు
లోకమంతయు ఏకమై
యుద్ధమునె మారణము చేయుము"

(మిగతా 8 వ పేజీలో)

పత్తిని పండించే రైతులకు రక్షణ లేదు

ప్రభుత్వం వెంటనే రైతువద్ద సరుకు కొనాలి

— వై. వి. కృష్ణారావు

మొదటినుంచీ సామ్రాజ్యవాదులు మన దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయలేదు; వ్యవసాయంమీదే ఆధారపడేటట్లు చేశారు. ఎందుకంటే, మనదేశంలో వారి పారిశ్రామిక వస్తువులు విరివిగా అమ్ముడు కావాలి; తమదేశానికి మన ముడిపదార్థాలు విరివిగా చేరాలి. పారిశ్రామికంగా మనదేశాన్ని అభివృద్ధి చేస్తే, దేశీయపరిశ్రమలు తమ పరిశ్రమలతో పోటీచేస్తాయి. అప్పుడు తమకు కావలసినన్ని లాభాలురావు.

ఇట్టి విధానంవల్ల, దేశీయ పరిశ్రమలేకాకుండా, వ్యవసాయానికి నష్టం ముప్పు వాటిల్లుతోంది. ఉదాహరణకు, పత్తిసంగతి తీసుకుందాం. పత్తి మనదేశంలో పండే ప్రధానమైన ముడిపదార్థాలలో ఒకటి. ఏటేటా మనదేశం దేశీయమిల్లుల అవసరాలకుమించి పత్తిని పండిస్తోంది. ఈ అదనపు సరుకంతా విదేశాలకు; ముఖ్యంగా బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, స్పెయిన్ వంటి యూరపియన్ దేశాలకు, జపాన్, చైనావంటి తూర్పుదేశాలకు, ఎగుమతి చేయబడుతూవుండేది. కాని, 1939 లో యుద్ధం ప్రారంభమైంది. మన దూదిని తెప్పించుకునే యూరపియన్ రాజ్యాలు హిట్లరు చేతుల్లోపడ్డాయి. అందువల్ల, ఆదేశాలకు దూది ఎగుమతులు ఆగిపోయాయి. 1941 లో జపానుకూడా యుద్ధంలో ప్రవేశించింది. అందువల్ల జపాను, చైనా ఎగుమతులు కూడా ఆగిపోయాయి. 1939-42 సంవత్సరాలలో మనదేశంలో ఉత్పత్తి అయిన మొత్తం దూది, దేశీయమిల్లుల వాడకం, విదేశాలకు వెళ్ళే ఎగుమతులు, ఎంతెంతో యీ క్రింది లెక్కలవల్ల తెలుసుకోవచ్చు. (400 పౌనుల్ల బరువుగల బేళ్ళలో)

సంవత్సరం	మొత్తం ఉత్పత్తి	దేశీయమిల్లుల వాడకం	ఎగుమతులు
1939	50,51,000	31,51,065	32,71,000
1940	60,80,000	36,17,147	20,13,000
1941	61,[illegible]	40,25,395	8,73,000
1942	45,64,000	42,80,117	3,01,000

ఈ విధంగా ఎగుమతులు విపరీతంగా పడిపోవడంవల్లనూ, దేశీయపరిశ్రమలకు ప్రోత్సాహం లేకపోవడంవల్లనూ, అదనంగా పండే పంట ఏమికావాలి? అనే ప్రశ్న బయల్దేరింది.

ఆంధ్రజిల్లాలలో పండే పత్తి

మన ఆంధ్రరాష్ట్రంలో బళ్ళారి, అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలు సుమారు 10 లక్షల యకరాల భూమిలో పత్తిని పండిస్తున్నాయి. ఇది 3 రకాలు: 1 "ముంగారి" (పొట్టిస్టేపుల్‌పత్తి), 2 "వెస్టర్న్‌పారం" లేక "హింగారి" (పొడవు స్టేపుల్), 3 "నంద్యాల" (పొడవుస్టేపుల్). మొత్తం పంటలో "ముంగారి" రకం చాలాతక్కువ. "వెస్టర్న్ పారం" పత్తి కర్నూలు జిల్లాయందలి పత్తికొండ తాలూకాలోను, బళ్ళారి, అనంతపురం జిల్లాలలోను ఎక్కువగా వేస్తారు. మద్రాసు రాజధానిలో ఉత్పత్తి అయే మొత్తం పత్తిలో "వెస్టర్న్‌పారం" పత్తి 100 కి 32 వంతులు. ఇదంతా పై 3 జిల్లాలలోనూ పండుతుంది.

మన తెలుగు జిల్లాలో ఇంత యెక్కువగా పత్తి పండుతున్నప్పటికీ, బట్టలమిల్లులు మనకు లేకపోవడంవల్ల పత్తిని దూదిగా తయారుచేసి, ఏటేటా వేలకొద్దీ బేళ్ళను ఆదోని, నంద్యాల సెంటర్లకు, అక్కడ్నుంచి బొంబాయి, అహమ్మదాబాదు మొదలైన పట్టణాలకు, పంపుతూ ఉంటారు.

యుద్ధం వచ్చి విదేశాలకు ఎగుమతులు ఆగిపోవడంవల్ల, దేశానికంతకూ వాటిల్లిన దుష్ఫలితాలు మన రాష్ట్రానికి కూడా సంభవించాయి. సాధారణ పరిస్థితుల్లో, సరుకు ఎక్కువగా మిగిలిపోతే, ధర తగ్గుతుంది. కాని, పత్తిధర తగ్గడానికిబదులు హెచ్చింది. ఇందుకు కారణం ఏమిటి? మామూలుగా యితర దేశాలనుండి మనదేశానికి దిగుమతి అయేబట్ట, నూలు యుద్ధంవల్ల దిగుమతికాకుండా చాలవరకు తగ్గిపోయాయి. సైనికావసరాలు కూడా ఎక్కువయాయి. అందువల్ల మన మిల్లుయజమానులు, వారి యేజంట్లు బట్టకు, నూలుకు, ధరలు విపరీతంగా పెంచివేశారు. వెంటనే పత్తివ్యాపారంచేసే బోకు వర్తకులు కూడా పత్తి ధరను ఎక్కువ చేశారు. ఇంతేకాక, దేశం మొత్తంమీద నోట్ల ముమ్మరం అధికం కావడంవల్ల అన్ని వస్తువుల మాదిరిగానే పత్తికి కూడా ధర పెరిగింది. వాయిదా బేరాలు జోరుగా కొనసాగాయి. ఈవిధంగా 1942 మార్చినెలలో పత్తికి పుట్టి 1కి (పుట్టి అనగా 784 పౌనులు) రు 246 మాత్రమే ఉన్నధర 1943 మార్చి నాటికి రు 654 లకు పెరిగింది. 1943 మే నెలలో రు 676 ల వరకు హెచ్చింది.

ధరల కంట్రోలు

కాని, 1943 లో కేంద్ర ప్రభుత్వం జారీచేసిన బట్టల కంట్రోలు ఆర్డరును అమలు జరపాలంటే, పత్తిధరలకుకూడా కంట్రోలు పెట్టవలసి వచ్చింది. 1943 మే నెలలో ప్రభుత్వం వాయిదా బేరాలను నిషేధిస్తూ ఒక ఉత్తరువు జారీచేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి మిల్లు యజమానులెవరూ సరుకుకొనవద్దని హెచ్చరించింది. 1943 మేనెలలో పుట్టి 1కి ఈ క్రిందివిధంగా గరిష్ఠ, కనిష్ఠధరలను నిర్ణయించింది.

	గరిష్ఠ	కనిష్ఠ
"వెస్టర్న్‌పారం"దూది	రు 660	రు. 510
"నంద్యాల"దూది	685	535

మిల్లు యజమానులు, వారి ఏజంట్లు బట్టలకంట్రోలు విధానాన్ని భగ్నంచేయాలని నిశ్చయించుకున్నారు. బోకు వర్తకులవద్ద దూది కొనడం మానివేశారు. అటు బోకు వర్తకులు రైతులవద్ద కొనడం మానివేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మార్కెట్లో ఎవ్వరూ కొనలేదు. ఈవిధంగా దూది మార్కెట్టు స్తంభించింది.

దీనికి ప్రభుత్వ విధానం బాగాతోడ్పడింది. ప్రభుత్వం దూదికి ధరలునిర్ణయించిందేగాని, ఆధరలకు దూదిని కొనేటట్లు చేయలేకపోయింది. తానైనా స్వయంగా కొని, మార్కెట్టు ధరను హెచ్చించిందాఅంటే, అదీ చేయలేదు. ఒక్క బొంబాయి, కరాచీ మార్కెట్లలో మాత్రమే కొంటూంది. ఫలితం 1943 లో పండిన మొత్తం పంటలో సగం రైతులవద్ద, వర్తకులవద్ద, మిగిలిపోయింది.

పరిస్థితు లిలా ఉండగా, 1944 వ సంవత్సరపు పంట వచ్చింది. అది కూడా మార్కెట్‌లో విడుదల కావాలి. ప్రభుత్వం మిల్లు యజమానుల్నీ, బోకు వ్యాపారస్తుల్నీ సంతృప్తి పరచాలనే ఉద్దేశంతో పైరేట్లను యింకా తగ్గించింది. "వెస్టర్న్‌పారం" (హింగారి) దూదికి ధర 1943 లో పుట్టి 1కి రు 510 - రు 660 (కనిష్ఠ, గరిష్ఠ) అని నిర్ణయిస్తే, 1944 జూలైలో రు. 370—రు. 570 అని నిర్ణయించింది. ఈ రేట్లు రైతుకు నష్టదాయకమని ఆంధ్ర వాణిజ్య సంఘంవారు ప్రభుత్వదృష్టికి తెచ్చాక, పై కనిష్ఠ-గరిష్ఠ రేట్లను ప్రభుత్వం రు. 20 చొప్పున హెచ్చించింది. ఈధరలైనా రైతుకు చాలా నష్టదాయకం. కనిష్ఠ ధరకు సరుకును అమ్మితే, రైతుకు మిగిలేది చాలా స్వల్పం అని ప్రభుత్వమే తన ప్రకటనలో అంగీకరించింది. కనిష్ఠరేటు కంటె తగ్గినట్లయితే, తామే కొంటామని ప్రకటించింది కూడ. కాని, యీ నాడు పరిస్థితు లెలాఉన్నాయి? కనిష్ఠధర కంటె కూడా మార్కెటుధర పడిపోయింది. ఆదోనిలో యీరోజున "వెస్టర్న్ పారం" (హింగారి) దూదికి ధర పుట్టి 1కి రు 280; ఈ ధరకైనా వర్తకులు ధారాళంగా కొంటున్నారా అంటే, అదీలేదు. పండిన సరుకులో చాలాభాగం రైతువద్దనే మిగిలిపోయింది. కుటుంబఖర్చులకు, వ్యవసాయపు ఖర్చులకు, రైతు గిజగిజ లాడుతున్నారు.

ప్రభుత్వ కర్తవ్యం

ప్రభుత్వం యిప్పుడైనా మేల్కొని, మిల్లు యజమానుల్నీ, నిలవవ్యాపారస్తుల్నీ సంతృప్తి పరచేవిధానానికి స్వస్తిచెప్పవలసివుంది. కనిష్ఠ రేటు కంటెమార్కెటు ధర పడిపోతే, తామే సరుకును కొంటామని ప్రభుత్వం వాగ్దానంచేసి వుంది. ఆవాగ్దానాన్ని ఇప్పుడు నిలబెట్టుకోకపోతే, రైతు మలమల మాడిపోతాడు. వ్యవసాయం నాశనమయే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రత్తిపంటను తగ్గించి, ఆహార పంటలకు ప్రోత్సాహ మివ్వడం ప్రభుత్వోద్దేశం బనట్లు ప్రభుత్వ ప్రకటనలో ఉంది. కాని, అందుకు మార్గం ఇదికాదు. మొదట రైతువద్ద నిలవ ఉన్న సరుకును ప్రభుత్వమే కనిష్ఠరేటుకు కొనాలి. అప్పుడే రైతుకు కొంత బనా రక్షణ ఏర్పడుతుంది. ముందు సంవత్సరానికి పత్తి పంటను తగ్గించి, ఆహారపంటలపై రైతు దృష్టిని కేంద్రీకరింపజేయవచ్చు.

నేడు 4 ఆంధ్రజిల్లాలలో రైతుల్ని యీ సమస్య ఎదుర్కొంటూంది. రైతులు - రైతు సంఘాలు, వెంటనే నిలవసరకును ప్రభుత్వం కొనేటట్లు ఆందోళన చేయాలి. రేపు 30 వ తేదీని జరుగబోయే బళ్ళారిజిల్లా రైతుమహాసభ యెదుటనున్న కర్తవ్యం యిదే.

బళ్ళారిజిల్లా ప్రథమ రైతుమహాసభ, రామదుర్గం

ఈనెల 30 వ తేదీన

మహాసభాధ్యక్షులు: టి. నాగిరెడ్డిగారు (అనంతపురం జిల్లారైతుసంఘాధ్యక్షులు)
ప్రారంభకులు: ముక్కామల నాగభూషణంగారు (ఆంధ్రరాష్ట్రరైతుసంఘ సహాయకార్యదర్శి)

రాత్రి వైజ్ఞానిక కార్యక్రమ ముంటుంది.

ఎం. చిన్న అన్నయ్య
ఆహ్వాన సంఘాధ్యక్షుడు.

ఈనాంబిల్లుకు రైతుల సవరణలు

ప్రభుత్వంసుముఖంగాఉందిగాని, ఈనాందార్లు వ్యతిరేకం

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి నందూరి ప్రసాదరావుగారు ఈ క్రింది ప్రకటనను గావిస్తున్నారు:

ఆంధ్ర ఈనాం రైతుల కమిటీ పక్షాన నేనున్నూ, ఆర్. వి. రామారావుగారున్నూ, 11-10-44 న మద్రాసు ప్రభుత్వమునకు ఒక మెమోరాండం సమర్పించాము. ఈనాం బిల్లుకు కమిటీ సూచించిన సవరణల నంగీకరించమని కోరాము. "చాకిరీ నిమిత్తము, లేక యితర నిమిత్తములకై ఇవ్వబడ్డ గ్రాంటులున్నా" అని బిల్లును సవరించుటకు అంగీకరించారు. లోగడ కోర్టు డిక్రీలివ్వబడ్డ ఈనాములకు కూడా బిల్లును వర్తింపజేయుట కంగీకరించారు. అనగా అందరి రైతులకు జిరాయితీ హక్కును కల్గజేయుటకు ఒప్పుకున్నారు. పోరంబోకుభూ సాముదాయిక భూములే కాబట్టి, ప్రత్యేకంగా ఉదహరించ నక్కరలేదనీ, ఇంద్రికలకూ, శివారు గ్రామాలకూ ప్రత్యేక రెవిన్యూ అక్కౌంట్లు వుంటే పూర్వపు ఆక్టు ప్రకారమే ఏర్పాటుగా పరిగణింప బడునని, చెప్పారు.

ఈవిధంగారైతులుకోరే ప్రధానమైన కోర్కెలు అంగీకరింపబడ్డా, బిల్లు ఆక్టు అయివచ్చుటకు ఆలస్యం కావచ్చును. ఈనాందార్లు కూడా అనాదే రాయబారంవచ్చి, బిల్లుకు ఆక్షేపణలు తెల్పారు. గవర్నరుకు తమ అభ్యంతరాలను తెలియజేస్తూ మెమోరాండం పెట్టారట. టి. ఆర్. వెంకట్రామశాస్త్రి, గోవిందరాజాచారి గార్లవంటి పెద్దలాయర్లు వారి కండగా వున్నారు. కాబట్టి మనం ఇంకనూ ఆందోళన తీవ్రతరం చేస్తేగాని, గండాలన్నీ గడిచి బిల్లు చట్టరూపంలోకి రాదు. కాబట్టి వెంటనే గ్రామగ్రామానా ఈనాంరైతులు సభ జరిపి, ఈనాంరైతుల కమిటీ సూచించిన సవరణలతోబిల్లును చట్టరూపంగా తేవలసినదని పిటీషన్లూ, టెలిగ్రాములూ మద్రాసు గవర్నరుకు పంపవలెనని కోరుచున్నాను.

అదనపు కరువుభత్యం — రైల్వేబోర్డు విధానం

పిల్లలమర్రి వెంకటేశ్వర్లు

రైల్వే కార్మికుల కరువుభత్యాన్ని వివరించుచూ, రైల్వేబోర్డు అక్టోబరు 7 వ తేదీన ఒక ప్రకటన చేసింది. దీని ప్రకారం కొద్దిమంది రైల్వే వుద్యోగస్తులకు కరువుభత్యపు రేట్లు యెక్కువ చేయబడ్డాయి. రైల్వే చౌకడిపోలలో కొన్నింటి సరుకులమీద ధరలు నూటికి 10 వంతున తగ్గించబడ్డాయి.

రైల్వేబోర్డు ప్రకటన

రైల్వే కార్మికులకు-కరువుభత్యం జోనల్ స్కీము ప్రకారం యిస్తున్నారు. జనాభానుబట్టి పట్టణాలను ఎ, బి, సి, జోన్సుగా విభజించారు. 50 వేల లోపు జనాభాగల పట్టణాలు 'ఎ' జోను, 50 వేలు మొదలుకొని 2½ లక్షల వరకు 'బి' జోను, 2½ లక్షనుండి 'సి' జోనుగా విభజింపబడ్డాయి. ఇవిగాక, బొంబాయి, కాన్పూరు, కలకత్తాపట్టణాలను స్పెషల్ జోన్సుగా యేర్పాటుచేశారు.

ఈ జోన్సులో నివసించే వారికిచ్చే కరువుభత్యంలోకూడ వ్యత్యాసమున్నది. అంతే కాకుండా, మిలిటరీయూనిట్సులో చేరినవారికి, చేరనివారికి కరువుభత్యం యివ్వటంలో తారతమ్యం చూపబడుతున్నది. మిలిటరీ యూనిట్సులో చేరినవారికి, చేరనివారికంటె కరువుభత్యం తక్కువ యిస్తున్నారు. ఈ ప్రకటన రాకపూర్వం కరువుభత్యం ఈ క్రిందివిధంగా యిస్తూ వుండేవారు.

స్పెషల్ జోనులో వుండేవారికి రు. 250 జీతాలలోపువారికి రు. 16-0-0, 'ఎ' జోనులో 200 రూపాయల జీతాల లోపువారికి రు. 14-0-0, 'బి' జోనులో రు. 175 లోపువారికి రు. 11-0-0, 'సి' జోనులో రు. 150 లోపువారికి రు. 9-0-0.

మిలిటరీయూనిట్సులోచేరినవారికి స్పెషల్ జోను, 'ఎ' జోన్సులోవారికి రు. 10-8-0, 'బి' జోన్సులోవారికి రు. 8-12-0, 'సి' జోనులోవారి రు. 7-0-0 యివ్వబడుతున్నది.

కొత్తప్రకటన ప్రకారం మిలిటరీ యూనిట్సులో చేరనివారికి, గెజిటెడ్ వుద్యోగస్తులు కాని వారికి, కరువుభత్యం యీక్రింది విధంగా వుంటుంది. (రైల్వేబోర్డుచే నియమింపబడిన వారే గెజిటెడ్ వుద్యోగస్థులు. మిగిలినవారు రైల్వేఏజెంటుచేనియమింపబడతారు). స్పెషల్ జోనులోను, ఏజోనులోను రు. 40, అంతకు పైజీతాలవారికి 16 రు, 'బి' జోనులో 14 రు, 'సి' జోనులో 13 రు. యివ్వబడుతుంది. 40 రు. లోపువారికి స్పెషల్ జోనులో 16రు, 'ఎ' జోనులో 14 రు. 'బి' జోనులో 11 రు. సి జోనులో 9 రు. యివ్వబడుతుంది.

మిలిటరీ యూనిట్సులో చేరినవారికి, స్పెషల్‌జోనులోను 'ఎ' జోనులోను 10-8-0, 'బి' జోనులో 8-12-0, 'సి' జోనుల్లో 7 రు. యివ్వబడుతుంది.

మిలిటరీలో చేరినవారికి చేరనివారికి కూడ కరువుభత్యం జీతాలలో 10 వంతులు తక్కువ కాకుండా యివ్వబడుతుంది. అంటే యీ ప్రకటన ప్రకారం కనీసపు కరువుభత్యం పదవ వంతు జీతానికి తక్కువ వుండరాదు.

గెజిటెడ్ వుద్యోగస్తులకు పెండ్లి అయిన వారికి జీతాలలో 10వ వంతు, కాని వారికి, 5. వంతు, 50 రు. 30 రు. లకు తక్కువ కాకుండా యివ్వబడుతుంది.

ఈప్రకటనవల్ల రేషన్సు విషయంలో రైల్వే కార్మికులందరికి కొద్దిపాటి సౌకర్యాలు కలిగినయి. పూర్వం తన భార్యా బిడ్డలకు, తనపై ఆధారపడే మరిద్దరికి రేషన్సు యిచ్చేవారు, ఇప్పుడు యీ ప్రకటనప్రకారం తనపై ఆధారపడే ముగ్గురికి యిస్తారు. చౌకడిపోలలో అమ్మేవస్తువుల ధరలు, పాలు - కూరగాయలు, కిరోసిన్, చిన్నపెట్టెలు, గుడ్డసబ్బు వీటి ధరలు మినహా-నూటికి 10 వంతులు తగ్గించబడ్డాయి.

ఈ అదనపు కరువుభత్యం రు. 40 జీతాలలోపు వారికి వర్తించదు. జీతాలలో 10 వంతులు తక్కువకాకుండా కరువుభత్యం వుండాలనే విషయం యెవరికి లాభకరమో చూద్దాం. మిలిటరీయూనిట్సులో చేరినవారికి 'ఏ' జోనులో రు. 110-0-0 పైన జీతంకలవారు రు. 11-0-0 పైన కరువుభత్యం పొందుతారు. 'బి' జోనులో 87-8-0 లకు మించి జీతాలు కలవారు 8-12-0 మించి కరువుభత్యం పొందగల్గుతారు. అదేవిధంగా రు. 70 లకు మించినజీతాలవారు సి జోనులో నివసించేవారైతే 7-0-0 పైన కరువుభత్యం పొందుతారు. అందువల్ల మిలిటరీ యూనిట్సులో చేరినవారికి ఏ జోనులోనివసించేవారికి రు 110, బి జోనులో 87-8-0, సి జోనులో 70-0-0 మించిన జీతాలు వుండేటట్లయితే యీప్రకటనవల్ల కరువుభత్యం యెక్కువ పొందగల్గుతారు. మిలిటరీ యూనిట్సులో చేరనివారు వరుసగా 180, 140, 120 పైన జీతాలు పొందుతూ, ఎ, బి, సి, జోనులలోనివసించు వారికి కరువుభత్యం జీతాలలో 10 వంతులు చొప్పున యివ్వబడుతుంది. వీరు 18, 14, 11 రూపాయల కరువుభత్యంకంటె యెక్కువ పొందుతారు.

ఈ అదనపు కరువుభత్యం యెంతమంది కార్మికులకు వర్తిస్తున్నది? 40 రు. లోపు జీతాలవారు నూటికి 78 మంది వుంటారు. మిగిలిన వారిలో మిలిటరి యూనిట్సులో చేరి రు 140, 87-12-0, 70 జీతాలవారికికూడ అదనపు కరువుభత్యంముట్టదు. వారిసంఖ్య నూటికి 10 వంతులు వుంటుంది. అంటె నూటికి 85 మందికి అదనపు కరువుభత్యం వర్తింపదు; మిగిలిన 15 మందికి, కరువుభత్యం పెంచకపోయినా సంసారాలు గడిచేవారికి పెంచబడ్డాయి. పెద్ద వుద్యోగస్తులు మిలిటరీ యూనిట్సులో చేరినా, ఎ. బి. సి జోనులలో యెక్కడవున్నా, కరువుభత్యం యెక్కువ చేయబడింది. దీన్నిబట్టి చూస్తే రైల్వే బోర్డు పాలసీని శంకించవలసి వస్తున్నది.

రైల్వే కార్మికులు కరువుభత్యం చాలటంలేదని తీవ్రమైన ఆందోళన చేస్తున్నారు. ఇటీవల జరిగిన అఖిలభారత రైల్వే పనివారల ఫెడరేషనులో కూడ కరువుభత్యం కనీసం రు. 45 వుండాలని కోరబడింది. రైల్వే బోర్డు అక్టోబరు 7వ తేదీన కరువుభత్యం పెంచారు అనేటప్పటికి, రైల్వే కార్మికులు ఉవ్విళ్ళూరిపోయారు. కాని యదార్థం గ్రహించేటప్పటికి, కార్మికులను నిరుత్సాహం ఆవరించింది. రైల్వే సెక్షన్ కేంద్రాలన్నిటిలోను అసంతృప్తి సభలు, వీలైనచోట్ల ప్రదర్శనాలు కూడ జరిగాయి.

కొద్దిమందికి యెక్కువచేసి, మిగిలిన వారికి చుంటిచెయ్యిచూపారంటే, అర్థం రైల్వే వుద్యోగస్తులను చీలదీయాలని, రైల్వే కార్మికుల నాయకత్వాన్ని కొట్టాలని, రైల్వే బోర్డు వుద్దేశం. రైల్వే కార్మికులు జోనల్ స్కీమును రద్దుచేయాలని తీవ్రంగా ఆందోళన చేస్తున్నా దానిని రద్దుచేయలేదు; కరువుభత్యం యిచ్చుటలో మిలటరీ యూనిట్సులో చేరినవారికి చేరనివారికి, మధ్య వ్యత్యాసం చూపడం మానలేదు సరికదా, క్రొత్తగా 40 రూపాయిల పై జీతగాండ్రకు, ఆలోపువారికి కూడ తారతమ్యం చూపుతున్నారు. ధరల పెరుగుదల ననుసరించి కరువుభత్యం యిస్తే సరిపోయే దానికి, కార్మికులలో యిన్ని తరగతులు కృత్రిమంగా కల్పించటం దేనికి? ఈ పద్ధతుల ద్వారా కార్మికులలో చీలికలు కలుగచేయగలం అనే ఆశయేకాదా!

అలాకాకపోతే, నూటికి దాదాపు 85 మందికి కరువుభత్యాన్ని యెక్కువచేయ నిరాకరించటానికి కారణం రైల్వే ఆదాయం సన్నగిల్లిందా? గత అసెంబ్లీ బడ్జెటు సమావేశంలో రైల్వేబోర్డు మెంబరు సర్ బెంథాల్ దాదాపు 45 కోట్లరూపాయిలు ఆదాయంవస్తున్నదని తెలియచేశాడు. కరువుభత్యం సగటునచూస్తే 8-0-0 మాత్రమే. ఇప్పుడు యెక్కువచేసింది అత్యంతస్వల్పమే కదా? ఆదనపు కరువుభత్యం కార్మికులందరికి యిచ్చేటట్లయితే, యీ 45 కోట్ల రూపాయిల లాభంలో మహత్తగ్గితే, 25 లక్షల రూపాయిలకంటె యెక్కువ తగ్గదు. అలాంటప్పుడు, కార్మికులలో యిన్నితరగతులు యేర్పరిచి, విభేదాలకు దావెందుకు కలుగచెయ్యాలి. అనైక్యతకల్గించుటకు కాకపోతే యీసంఘా యెవరికిలాభం? గత అసెంబ్లీ బడ్జటు సమావేశంలోనే రైల్వే కార్మికుల కృషిని ప్రశంసించి, "రైల్వేనుమీరు ఇప్పటికంటె యెక్కువ జోరుగా నడపాలి. ఎందువల్లనంటె ఇండియా ప్రధానమైన యుద్ధరంగం కాబోతున్నది" అని వుద్ఘాటించాడు సర్ బెంథాల్. కావి కార్మికుల దేశభక్తిని ఆధారంగా చేసుకుని వుత్సాహాన్ని రగులకొల్పటానికి యిదేనామార్గం? సర్ బెంథాల్ పలుకులను కార్మికులు పాటించాలంటే, వారిలో 100 కి నూరుగురూ ఐకమత్యంగా ఉండాలి. వారిలో కల్గించిన యీ కృత్రిమ చీలికలు అనైక్యతకు దారితీస్తాయి. కనుక వాటిని రద్దుచెయ్యాలి.

ఈ కార్మికులు కోరేది గొంతెమ్మకోర్కెయా? ఎలా అవుతుంది? ప్రభుత్వంచే నియమించబడిన రావుకమిటి సూచన ప్రకారం కరువుభత్యం కనీసం40 రూపాయలువుండాలి. కనీసం యీ కరువుభత్యం యిస్తేనేకాని కార్మికులు ప్రస్తుత ధరల పెరుగుదలల ననుసరించి జీవించజాలరని తెలియజేశాడు. కార్మికులు కోరుతున్నదికూడ అదేగా? రైల్వేలు కోటానకోట్లు లాభాలు గడించుచున్నప్పుడు యీ కార్మికుల కోర్కెలను తృణీకరించడం న్యాయంకాదు. అంతే కాకుండా ప్రభుత్వమే, 25 రూపాయిల జీతాల లోపు వారికి ధరల పెరుగుదల ననుసరించి కరువు భత్యం [illegible] సూచించింది ([illegible]). దాని ప్రకారం [illegible] రైల్వే కార్మికుల [illegible] యెక్కువ కరువుభత్యం [illegible] వుంటుంది.

రైల్వేకార్మికుల కర్తవ్యం

రైల్వేబోర్డు అవివేకపు పాలసీ[illegible] కులు ఫు[illegible] కాటం [illegible] వారికి జరుగుతున్న అన్యాయాల[illegible] యెదుర్కొటం; రైల్వేకార్మికుల[illegible] దియ్యాలని కదా రైల్వేబోర్డు పన్ను[illegible] రైల్వేకార్మికులు గ్రహించాలి. రై[illegible] యెన్ని తరగతులు యేర్పాటుచేసినా, విభేదాలు కలుగచేసినా, ఐకమత్య[illegible] దాన్ని గుర్తించి రైల్వేలో నూటికి [illegible] మందిని యూనియన్‌లో చేర్పించాలి. [illegible] బోర్డు పాలసీనిగూర్చి అన్ని తరగతు[illegible] ప్రచారంచేసి, రైల్వేకార్మికుల [illegible] అధికం చెయ్యాలి. తమకు జరుగు[illegible] అన్యాయాలను యెదుర్కొనేందుకు [illegible] రెచ్చిపోయి సమ్మెకుదిగడంకాదు. [illegible] దేశం కరువు కాటకాలకుగురియై, వాటి[illegible] నుండి తప్పించుకొన లేకుండా వున్న[illegible] కార్మికులు రవాణా సౌకర్యాలను [illegible] పరచేటట్లయితే, వారు నష్టపడుతున్నది, [illegible] పెడుతున్నది, రైల్వేబోర్డునుకాదు, [illegible]లను - కరువుపీడితులై, తిండిలేక [illegible] తమసోదరులను. దేశాన్ని, ప్రజలను కా[illegible]టానికై, తమ దేశభక్తి వెదజల్లుతూ, [illegible] ట్రాన్సుపోర్టును ద్విగుణీకృతమైన [illegible]హంతో సాగిస్తే, ప్రజలంతా, సా[illegible] తప్పక యీ కార్మికులు పొందగల్గుతారు. ఇందుకు నిదర్శనంకావాలంటే, గత అసెంబ్లీ సమావేశంలో ప్రజాపార్టీలన్నీ, కాంగ్రెసు-[illegible] సభ్యులంతా, రైల్వేకార్మికుల కోర్కెలను [illegible] పరిచారు. జపాను బాంబులకుగూడ [illegible] దీయక ట్రాన్సుపోర్టును సక్రమంగా సాగిస్తూ ప్రజలకు కూడు గుడ్డ అందజేసిన కార్మికుల వెనుక ప్రజలు నిలబడతారంటే, ప్రజా[illegible] వాయకులు వీరిని బలపరుస్తున్నారంటే, ఆశ్చర్యమేమున్నది.

ప్రజా సహకారంతో రైల్వే కార్మికులు తమకోర్కెలు కొన్నింటినినెగ్గించుకోగల్గారు. ఇప్పుడుకూడ ట్రాన్సుపోర్టు విధానం భగ్నం కాకుండా, రైల్వే కార్మికులు పనిచేస్తుంటే, ప్రజల సహకారంతో రైల్వే కార్మికులు తమ కోర్కెలు నెరవేర్చుకొని, తమకు జరుగుచున్నఅన్యాయాలను పోగొట్టుకోగలుగుతారు.

ఇప్పటివరకు రైల్వేకార్మికులు సాధించిన విజయాలు, స్వల్పమైనవా? కావు. యూనియన్ రికగ్నిషన్ విషయంలో, ప్రావిడెంటుఫండు విషయంలో, చౌకడిపోల విషయాలలో కార్మికులు తమ కోర్కెలను నెరవేర్చుకోగల్గారు. ట్రాన్సుపోర్టును భగ్నంచేయకుండా, ప్రజలకు దేశానికి సేవచేయుటవల్ల, ఇక మీదటకూడా తమ కోర్కెలను సాధించుకోగలరు.

అ. భా. ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ దినోత్సవం

అక్టోబరు 31 తేదీకి అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు పుట్టి 25 సంవత్సరాలైనది. ఆంధ్రలో అన్ని కార్మిక సంఘాలు అక్టోబరు 31 ఏ. ఐ. టి. యు. సి. దినము జయప్రదంగా జరపాలి. ఆరోజున బ్రహ్మాండమైన ఊరేగింపులుజరిపి కార్మికులు తమ దేశభక్తిని, హక్కులను వెల్లడించాలి. సభలలో అధికోత్పత్తిపై, రాజకీయ ఖైదీల విడుదలకై, ఆహార సమస్య, కరువుభత్యము, కార్మిక జీవిత సౌకర్యాలపై తీర్మానాలు గావించాలి. అన్ని సంఘాలు యీ దినోత్సవము గురించి రిపోర్టులు, 'ఎడిటర్' ట్రేడ్‌యూనియను రికార్డు, (గిర్‌గాం, బొంబాయి)కి, ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిలుకు (బెజవాడ) పంపాలి.

సి. వి. కె. రావు,
అధ్యక్షుడు, ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిలు.

తిరువూరు తాలూకాలో

పుట్రాల జమీందారుకు వ్యతిరేకంగా రైతులపోరాటం

— అనుమర్లపూడి సీతారామారావు

తిరువూరుతాలూకా (కృష్ణా)లో మల్లవరం అనే జమీందారీ గ్రామం ఉంది. ఆ గ్రామంలో 100 యకరాల విస్తీర్ణంగల మామిళ్ళబీడు ఒకటి ఉంది. అందులో రైతులు అనాదినుంచీ తమ పశువుల్ని మేపుకుంటూ, బీటిని సాముదాయికంగా అనుభవిస్తున్నారు. దానిమీద జమీందారుకెట్టిహక్కూ లేదు. అయినప్పటికీ, ఒక నైజాం రైతుకు జమీందారు రు. 2700 కు ఆ భూమిని విక్రయించారు.

1941 లో యీగ్రామాన్ని పుట్రాల జమీందారు కొన్నారు. ఇతని హయాంలో రైతుల కష్టాలు ఇంకా యెక్కువయాయి. ఇతడు పూర్తిగా నైజాంరైతు పక్షంచేరి, రైతుల్ని అణచడానికి పూనుకున్నాడు. అందువల్ల, గ్రామస్థులందరూ ఏకమై, బీటిపై తమకుగల హక్కును తిరిగి సంపాదించుకోడానికి నైజాం రైతుమీద వేసిన దావాను పట్టుదలతో నడుపుకొంటున్నారు.

మూడు సంవత్సరాలైంది. జమీందారు గ్రామైక్యతను చెడగొట్టి, రైతుల్ని లొంగతీయడానికి ఎన్ని చేయాలో అన్నీ చేశారు. బంజరు భూములిస్తానని ఆశపెట్టి 6 గురు రైతుల్ని తనవైపు తిప్పుకున్నాడు. మిగతా వారిని క్రిమినల్ కేసులలో యిరికించి, వారి మనోధైర్యాన్ని చెడగొట్టాలని ప్రయత్నించాడు. కొంగర పుల్లయ్య, మరి 6 గురి మీద తప్పుడుకేసులు బనాయించి, కోర్టుల చుట్టూ తిప్పించాడు. ఈదాటికి రైతులు నిలబడలేకపోయారు. పట్టు తగినంత పోగుకాక, ఎవరంతటవారు జారిపోనారంభించారు. జమీందారుతో నెగ్గడం సాధ్యంకాదనుకొని, జమీందారుపెట్టిన షరతులకు తల ఒగ్గడం కూడా జరిగింది.

వెంటనే తిరువూరుతాలూకా రైతుసంఘం యీ సమస్యను పరిష్కరించడానికి ముందుకొచ్చింది. మల్లవరం సెంటరులో బోధాయనాచారిగారిని ఆర్గనైజరుగా నియమించింది. జమీందారు దుండగాల నెదుర్కోడానికి రైతులంతా తిరిగి తమ సంఘశక్తిని ప్రదర్శించాలని ఎడతెగని ప్రచారం జరిగింది. రైతుల్లో తిరిగి ఆశారేఖలు చిగిర్చాయి. రెండురోజుల్లో దావాఖర్చులకు రు. 1000 వసూలు చేశారు. ఆ దావు 6 గురితో ఏర్పడ్డ ఒక కమిటీకి స్వాధీనం చేయబడింది.

ఈ కృషివల్ల గ్రామస్థులలో ఉత్సాహం బయల్దేరింది. జమీందారీ పక్షంతో చేతులు కలిపిన రైతులుకూడా రైతుసంఘం వైపు కొచ్చారు. ఉమ్మడిఫండుకు వారుకూడా విరాళాలిచ్చారు. దావాకు సంబంధించిన వ్యవహారకాండ ఒక నిర్మాణరూపం దాల్చింది. అప్పీలు ద్వారా 40 యెకరాల బీడుకు రైతులు ఇంజక్షన్ ఆర్డరు పొందగలిగారు బీటిలో తిరిగి తమ పశువుల్ని మేపుకొనే అవకాశం లభించినందుకు రైతులు సంతోషించారు. ఇంతేకాదు. కొంగర పుల్లయ్య, మరి 6 గురిపై తేబడ్డ క్రిమినల్ కేసుకూడా పరిష్కరింపబడింది. ముద్దాయిలు. జమీందారీ పక్షానికి చెందిన ఫిర్యాది కోర్టుకువెళ్ళి కేసును ఎత్తివేసుకున్నారు. దీనితో జమీందారుకు వెర్రెత్తి నైజాంకొన్న కొందరు మహమ్మదీయ రైతుల్ని రెచ్చగొట్టి చోపిన్ను - దొమ్మీలు చేయించాలని ప్రయత్నించాడు. కాని, మహమ్మదీయ రైతులు విషయమంతా తెలుసుకొని, అట్టి మాతుకచర్యలకు పూనుకోకుండా వెళ్ళిపోయారు.

కథ పూర్తిగా అడ్డంతిరగడం చూచి, జమీందారు తన చేలో పశువుల్ని మేపారనీ, అరకలు విప్పారనీ, యిత్యాది ఆరోపణలతో 35 గురి మీద క్రిమినల్ ఛార్జి యిచ్చాడు. కొందరిని దౌర్జన్యంగా కొట్టించాలనికూడా ప్రయత్నం చేస్తున్నాడు. కాని, తాలూకా రైతుసంఘం మెలకువతో ప్రవర్తిస్తోంది. రైతులు రెచ్చిపోకుండా చూస్తోంది. వారి ధైర్యం చెడకుండా నైపుణ్యంతో నాయకత్వం వహిస్తూ పనిచేస్తోంది. హైదరాబాద్ ఆంధ్ర మహాసభవారి సహాయంతో, గ్రామ బీటిని కొన్న నైజాంరైతును కూడా ఒప్పించి, ప్రజలపక్షం వహించేలా చేయడానికి ప్రయత్నిస్తోంది.

ఈ పోరాటంలో రైతుల సంఘచైతన్యం నానాటికి హెచ్చుతోంది. మల్లవరంలో 100 మందికి పైగా రైతుసంఘంలో చేరి, గ్రామకమిటీని ఏర్పరచుకొంటున్నారు. రొంపిమళ్ల, రాజవరం, పెద్దగొలను మొదలైన గ్రామాల్లో కూడా రైతుసంఘాలేర్పడుతున్నాయి.

★ చిన్నహోతూరుగ్రామంలో

రైతు - కూలీలమధ్య కనివినియెరుగని సామరస్యం

— పూరిమెట్ల వెంకటరామప్ప

బళ్లారిజిల్లా, ఆదూరుతాలూకాలో చిన్నహోతూరు అనే గ్రామం ఉంది. ఆగ్రామంలో ఎన్నడూ రైతు - కూలీలమధ్య సామరస్యం లేదు. వ్యవసాయ కూలీలలో త్రాగుడు, దొంగతనం బాగా అలవాటు. చేలో ఉన్న పంటను చేలోనే కాల్చి నాశనంచేయడం, రైతుల పశువుల్ని చంపి తినడం, దొమ్మీలలో పాల్గొనడం - జోరుగా సాగుతూఉండేవి. రైతులు పోలీసుల నాశ్రయించి, కూలీలపై కేసులు పెట్టించడం, వారిని సి. టి. ఆక్టులో చేర్పించడం, కొట్టడం - మొదలైన నిర్బంధాలు జరిపేవారు. రోజురోజుకి అక్రమాలు, దౌర్జన్యాలు ప్రబలడంచూచి, రైతుసంఘం తరపున లావ్ సాహెబ్‌గారు ఒక నెలరోజులు వరుసగా రైతుల్లోను - కూలీలలోను ఐక్యత యొక్క అవసరాన్నిగురించి ప్రచారంచేశారు. 16-10-44 వ తేదీని గ్రామంలో రైతులు - కూలీలు షుమారు 400 మంది సమావేశమయారు, సభలో యీక్రింది నిర్ణయాలు తీసుకున్నారు.

1. కూలీ ఆదోని శేరుతో (సరియైనది) కొలవాలి.

2. సేద్యపు పనులకు $2\frac{1}{2}$ శేర్ల ధాన్యం మగవాళ్ళకు, 2 శేర్లు ఆడవాళ్ళకు, $1\frac{1}{2}$ శేరు పిల్లలకు, యిస్తూఉండాలి.

3. కోతకూలీ మగవాళ్ళకు 3 శేర్లు, ఆడవాళ్ళకు $2\frac{1}{2}$ శేర్లు, పిల్లలకు 2 శేర్లు, ఉండాలి.

4. ఉదయంనుండి సాయంత్రంవరకుచేసే కళ్ళము, వగైరా పనులకు 4 శేర్లు ఉండాలి.

5. ఇదివరలో చేస్తూఉంటే కాలంకంటె మరొకగంట ఎక్కువపని చేయాలి. (అనగా రోజుకు 7 గంటలు).

6. పొలాలలో దొంగతనములు, కాల్పులు జరగకుండా చూచుటకు గ్రామసంఘం తరపున 6 గురు కూలీలను నియమించింది. వారికి రోజు 1కి $3\frac{1}{2}$ శేర్లు చొప్పున కూలీయివ్వాలి.

ఈ నిర్ణయాలకు రైతులూ - కూలీలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఈ కట్టుబాటు పెద్దహోతూరు మొదలైన యితర గ్రామాలను కూడా ఆకర్షించింది. ఐక్యతతో సంఘీభావాన్ని కాపాడుకోవాలనే కోరిక ఆ గ్రామస్థుల్లో ప్రవేశించింది. రైతుసంఘ వర్కర్లు యిందుకై శ్రద్ధతో పని చేస్తున్నారు.

★

బెల్లం ఉత్పత్తిపై ప్రభుత్వ నిషేధపు టుత్తరువు

ది 10—10—44 న ఫోర్టుసెంటు జార్జి గెజిటులో తుమ్మపాల ఫ్యాక్టరీ ఏరియాలో తుమ్మపాల, అనకాపల్లి మొ॥ 7, 8 గ్రామాలలో రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు అనుమతి లేనిదే చెరుకును బెల్లముగా ఆడకూడదని, చెరకు తయారుకాగానే ఫ్యాక్టరీవారికి యివ్వాలని, ఆర్డరును సివిల్ సప్లైస్ కమీషనరుగారు జారీజేసారు. క్రిందటి సంవత్సరం ఈ ఫ్యాక్టరీ ఏరియాలో షుమారు 50 వేల టన్నుల చెరుకుగల 16 గ్రామాలపై ఇదేవిధముగా నిషేధాజ్ఞను జారీచేయడము, రైతుల ఆందోళనపై ఆర్. డి. ఓ. సమావేశపరచిన రైతులు, మిల్లుప్రతినిధి, గలసమావేశములో మిల్లువారు 20,000 టన్నులు తీసుకుంటామన్ని, ఆవిధంగా తీసుకోకపోవడం, షుమారు 6,000 టన్నుల చెరుకు పండి పనికిరాకుండా పోవడం అందరికీ తెలిసిందే. ఈవిధముగా నష్టపడ్డ రైతులకు మిల్లు యజమానినుండి నష్ట పరిహారాన్ని యిప్పించవలసిందని ప్రభుత్వమును అనేక పర్యాయములు కోరినా యింతవరకూ ప్రభుత్వము పట్టించుకోకుండా కూర్చున్నది. తిరిగి యీ సంవత్సరముకూడా అట్టి అవకతవకలు, రైతులకు అన్యాయములు జరుగకుండుటకుగాను ప్రభుత్వము వెంటనే యీ క్రిందిచర్యలను తీసుకోవాలి:

(1) ప్రభుత్వం, మిల్లుయజమాని, రైతు ప్రతినిధులతో కూడిన జాయింటు కమిటీని ఏర్పాటుచేయాలి. (2) ఫ్యాక్టరీ యీ సంవత్సరము యెంత చెరుకు ఆడగలదో యీ కమిటీయే నిర్ణయించాలి. అంత చెరుకును మాత్రమే మిల్లుకుగాను వుంచి, మిగతా చెరుకుపై నిషేధము తొలగించాలి. (3) ఈ అగ్రిమెంటు ప్రకారముగా మిల్లుయజమాని తీసుకోవలసిన చెరుకును తీసుకోని పరిస్థితులలో రైతుకు నష్టపరిహారాన్ని మిల్లుయజమాని యివ్వాలి. (4) క్రిందటిసంవత్సరపు నష్టపరిహారాన్ని మిల్లుయజమానులచే వెంటనే యిప్పించాలి.

రైతులు పై కోర్కెలకై వెంటనే ఆందోళనచేసి తమ న్యాయమైన కోర్కెలు రాబట్టుకోవాలి.

ఇట్లు
— సందూరి ప్రసాదరావు
ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం, బెజవాడ.

(2 వ పేజీ తరువాయి)నాటకమాడాడు. ఇ.ఏ.యం. ని. కమ్యూనిస్టుపార్టీని చేర్చకుండాఒక బూటకపు జాతీయప్రభుత్వాన్ని ఏర్పరచబోయాడు. ఆపాచికా పారలేదు. చివరకు సెప్టెంబరులో, ఇ. ఏ. యం. ప్రతినిధులను అయిదుగురిని ప్రభుత్వవర్గంలో చేర్చుకోక తప్పిందికాదు వీరిలో ఇద్దరు కమ్యూనిస్టులు.

రాజంటే ఈఅసహ్యత ఎందుకు?

గ్రీకు ప్రజలకు తమ రాజంటె ఇంతరోత ఎందుకని అడగవచ్చు. ఒక బూటకపు ప్లెబిసైటు ఫలితంగా 1935 లో జార్జిరాజు ప్రవాసంనుంచి వచ్చి ప్రజల నెత్తినెక్కాడు. ప్లెబిసైటుకు ముందు చేసిన వాగ్దానాలన్నిటికి, ఆ మరునాడే బుట్టదాఖలు చేశాడు. కఠోర నియంతృత్వాన్ని అమలు జరిపాడు. ఫాసిస్టు జనరల్ అయిన మెటాక్సాసుకు ప్రజలను వప్పగించాడు. ఇతను గ్రీకు పార్లమెంటును రద్దుచేశాడు. పత్రిక నోళ్లు మూసివేశాడు. ప్రజాసంస్థలను, కార్మికసంస్థలను అణగద్రొక్కాడు. అభివృద్ధికర భావాలుగల వేలకొలది స్త్రీ పురుషులను ఊహింపరాని చిత్రహింసలకు గురిచేశాడు. ఈరాక్షసుడు చచ్చిపోయిన తరువాత, జార్జిరాజు ఒక ప్రకటన చేస్తూ, మెటక్సాను అడుగు జాడల్లోనే దేశం పరిపాలింపబడుతుందన్నాడు. ఇప్పుడు దుర్భర నాజీచెరనుండి విముక్తి పొందుతూన్న గ్రీకు ప్రజలకు, ఈరాజు తిరిగి రావాలా, కూడదా అని నిర్ణయించుకునే హక్కుఉంది - వారే నిర్ణయిస్తారు కూడాను. ఇ. ఏ యం. పరిపాలన క్రిందనున్న ప్రదేశాలలో పర్యటనం చేసివచ్చిన ఒక అమెరికా విలేఖరి మొన్న మొన్ననే ఇలా రాశాడు. "జాతీయ స్వాతంత్ర్య సైన్యం చాల సుశిక్షితమైనది. కొత్తగా ఏర్పడిన జాతీయప్రభుత్వం ద్వారా మిత్రమండలికి పూర్తి సహకారం చేయడానికి ఇ. ఏ. యం. లోని అన్నిపక్షాలు ఏకగ్రీవంగా అంగీకరిస్తున్నాయి. ప్రజా నిర్ణయం (ప్లెబిసైటు) జరగనిదే రాజు తిరిగి రాకూడదని అందరూ ఏకకంఠంతో అంటున్నారు." మొన్న కొత్తప్రధాని గ్రీసులో ఒకచోట గ్రీకుపతాకాన్నెగురవేస్తూ ఉపన్యసిస్తుండగా సభికులు "మాకు రాజావద్దు, ప్రజాప్రభుత్వంకావాలి" అని తమవాంఛను వెల్లడించారు. ఇప్పుడు ఇ. ఏ. యం., జాతీయ ప్రభుత్వం— రెండూ పరస్పర సహకారంతో దేశాన్ని ముందుకు నడుపుతున్నాయి. గ్రీసులో దిగిన బ్రిటిషు సేనలు దేశంయొక్క పూర్తి విమోచనాన్ని ఇంకా చేరువకు తెస్తున్నాయి. గ్రీసు చరిత్రలో ఉజ్వలఘట్టం త్వరలో ప్రారంభం కానుంది. ఇ. ఏ. యం. నాయకత్వంక్రింద గ్రీసు ప్రజలు, సైనికులు నిర్మించుకున్న అచంచలమయిన ఐకమత్యమే భావి భాగ్యోదయానికి దారితీస్తుంది. గ్రీసుచరిత్ర స్వాతంత్ర్య కాముకులకు నేర్పుతూన్న పాఠం ఇదే.

మహిళా ఉద్యమం అన్నివర్గాల మహిళల్ని ఐక్యపరుస్తోంది

ఏలూరు మహాసభ చూపుతూన్న ఆదర్శం

— మా విలేఖరి

20 కోట్లమంది భారత మహిళలు అజ్ఞానాంధకారంలో మునిగియున్నంతకాలం భారత దేశానికి దాస్యవిముక్తి లేదంటూ, స్త్రీలందరినీ దేశ సేవకు పిలుస్తోందా - అన్నట్లు "కస్తూరిబా గాంధీ" గేటు ప్రతినిధుల్ని, ప్రేక్షకుల్ని ఆహ్వానిస్తోంది. సభావేదికపై శ్రీమతి సరోజినీ దేవి, విజయలక్ష్మీపండిట్ మొదలైన వీర నారీమణుల చిత్రపటాలు అలంకరింపబడ్డాయి. జాతీయ నాయకుల ఫొటోలతో, "స్వాతంత్ర్యం, శాంతి, అభ్యుదయం" అని వ్రాసివున్న పతాకాలతో, సభామందిరం శోభాయమానంగా ఉంది.

అది ఏలూరు పట్టణ మహిళా మహాసభ. షుమారు 1000 మంది స్త్రీలు కిటకిటలాడుతూ మొన్న 8వ తేదీని సభాభవనాన్ని అలంకరించారు. వీరిలో అన్నివర్గాల స్త్రీలు ఉన్నారు. కుల, మత విభేదాలు లేకుండా ఉత్సాహంతో తమ బిడ్డల్ని చంకనబెట్టుకు వచ్చారు.

ఎందుకింత ఉత్సాహం ? ఎందుకింత ఆనందం ?

పట్టణ మహిళాసంఘ కృషి

ఏలూరులో మహిళాసంఘం స్థాపించబడినప్పటినుంచి, స్త్రీల యిబ్బందుల్ని తొలగించుతూ, వారిలో సంఘచైతన్యం కలుగజేస్తూ వచ్చింది. మండు వేసంగిలో కూలీపేటల స్త్రీలు నీటికోసంపడ్డ బాధలు ఇన్నీ అన్నీ కావు. పైపులవద్ద వందలకొద్దీ బిందెలు, కుండలు ! గంటలకొద్దీ నిలబడ్డం ! ఒక్క నీటిచుక్క దొరికితే మహాభాగ్యంగా ఉండేది ! ఇంట్లోపనులన్నీ మానుకుని, కన్నబిడ్డలు గుక్కపెట్టి యేడుస్తూన్నా బిందెడునీళ్ళకోసం గంటల తరబడి వీధుల్లో పడిగాపులుపడ్డం ! అక్కడ జరిగే కయ్యాలు, ఘర్షణలు, తోపిళ్ళు-తొబ్బు ! ఎన్నాళ్ళు యిలా అవస్థలుపడ్డం ? పట్టణ మహిళాసంఘం వెంటనే నడుంకట్టింది. 300 సంతకాలతో మునిసిపల్ కమీషనర్ వద్దకు రాయబారం వెళ్ళింది. మరునాడు కూలీపేటల్లో ఎక్కడ చూచినా సంతోష వదనాలే. వేలకొద్దీ స్త్రీలు రోజూ మరో రెండు గంటలు నీళ్ల పట్టుకోడానికి అనుమతి వచ్చింది !

మరోపేటలో ముస్లింలు ఎక్కువగా నివశిస్తారు. స్త్రీలకు ఘోషా. ఏనాడో కట్టిన మరుగుదొడ్డి శిథిలమైపోయింది. పట్టణ మహిళా సంఘానికి తమ యిబ్బందినిగూర్చి తెలుపుకున్నారు. మహిళా సంఘం మునిసిపాలిటీచేత ఆ యిబ్బందిని తీర్చేటట్లు చేసింది. మిగతా పేటల్లో కూడా స్త్రీలకు మరుగుదొడ్డి వసతి వచ్చేవరకూ మహిళా సంఘం ఊరుకోలేదు.

70 వేల జనాభాగల ఏలూరు పట్టణానికి ఒకే ఒక ప్రసూతి కేంద్రం ! అక్కడైనా మంత్రసానులు ముగ్గురుమాత్రమే ! అనుభవం గల లేడీ డాక్టరు వెళ్ళిపోయింది ! అందువల్ల, నాటు మంత్రసానుల మిడిమిడి జ్ఞానం ఎంత మంది బాలింతల్ని, శిశువుల్ని చంపుతోందో ! ఎంతమంది ప్రసూతి రోగాలకు గురిఅవుతున్నారో ! పట్టణ మహిళాసంఘం వీధివీధికి తిరిగి, "మాతా శిశురక్షణాలయాన్ని" ఉపయోగించుకొనేలా వేలకొద్దీ స్త్రీలలో ప్రచారంచేసింది. లేడీ డాక్టరును తిరిగి నియమించాలని మునిసిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చింది. 1700 మంది స్త్రీల కోర్కెను తెలియజేస్తూ ఒక మహజరుతో రాయబారం నడిపింది. మునిసిపాలిటీవారు లేడీ డాక్టరు దొరికిన వెంటనే నియమిస్తామని వాగ్దానంచేశారు.

స్త్రీల విజ్ఞానాన్ని పెంపొందించ దానికి మహిళాసంఘ సభ్యులు రెండు పేటలలో పత్రికలు వీరేశలింగం పంతులుగారి ప్రహసనాలు, చదివి వినిపిస్తున్నారు. పురుషులతో సమానంగా స్త్రీలకు ఆస్తిహక్కు ఉండాలనీ, వివాహ విషయంలో స్త్రీలకు జరిగే అన్యాయాలు పోవాలనీ, వందలకొద్దీ స్త్రీలలో ప్రచారం చేశారు. రావుకమిటీబిల్లులో సరియైన సవరణలు చేయాలని సంతకాలు చేయించారు.

ఈ విధంగా ఏలూరు పట్టణ మహిళా సంఘం అన్నితరగతుల స్త్రీలలోను ప్రచారం చేసి, వారి యిబ్బందుల్ని తీరుస్తూ, వారిలో విజ్ఞానం కలుగచేసిన ఫలితంగా, ఆనాడు షుమారు 1000 మంది స్త్రీలు మహాసభకు వచ్చారు. కాంగ్రెసు ఉద్యమాలలో పాల్గొని, స్త్రీల అభ్యున్నతికై పాటుబడుతూన్న శ్రీమతి చుండూరు రత్నమ్మగారు, సత్తిరాజు శ్యామలాంబగారు సభావేదిక నలంకరించారు. వారిప్రక్క కవయిత్రి జాస్తి పర్వతవర్ధనమ్మగారు, ఈదర సుబ్బమ్మగారు, కూచున్నారు. పట్టణ మహిళాసంఘాన్ని చొరవతో నడుపుతూన్న కమ్యూనిస్టు స్త్రీలు ఉన్నారు. పార్టీ విభేదాలుగాని, కుల - మత విచక్షణలుగాని ఆనాడెక్కడా కనిపించలేదు !

చక్కని కంఠాలతో గానకళలో పోటీలు జరిగాయి. స్త్రీల అభ్యుదయాన్ని గురించి బాలికలు, యువతులు ఉద్వేగంతో పాటలు పాడారు. కొందరు నూలు వడకడంలో తమ నేర్పరితనాన్ని ప్రదర్శిస్తూ, సభా మందిరాన్ని అలంకరించారు.

మొదట శ్రీమతి సత్తిరాజు శ్యామలాంబగారు పతాకోత్సవం జరిపారు. ఝాన్సీ లక్ష్మీబాయివలె ప్రతిస్త్రీ తయారు కావాలని ఉద్బోధించారు. సభ కధ్యక్షతవహించిన శ్రీమతి రత్నమ్మగారు, స్త్రీలను నేడెదుర్కొంటూన్న వివిధ సమస్యలపై ఉపన్యాసంగావించారు.

ఉపన్యాసాల అనంతరం తీర్మానాలు జరిగాయి. గాంధీ-జిన్నాలు తిరిగి సమావేశమై రాజీకి ప్రయత్నించాలనీ కాంగ్రెసు నాయకులందరినీ విడుదలచేయాలనీ, తీర్మానించారు. పట్టణంలో మరుగుదొడ్లులేని స్థలాలలో తగినన్నిదొడ్లు కట్టించాలనీ "మాతాశిశు రక్షణాలయం"లో వెంటనే లేడీడాక్టరును నియమించాలనీ, మునిసిపల్ అధికారుల్ని కోరుతూ తీర్మానాలు జరిగాయి.

రాత్రి "నాటుమంత్రసాని" అనే నాటకం ప్రేక్షకుల్ని ఆనంద పరచింది.

తమ సంఘాన్ని కట్టుబాటుతో యింకా బాగా అభివృద్ధిచేసుకోవాలనే ఆకాంక్ష అందరిలోను రేకెత్తింది.

విజ్ఞానం - వికాసం

ఈ శీర్షికక్రింద ప్రజలకు వినియోగపడే నూతన పరిశోధనలనుగురించి వార్తలను ప్రకటించాలని మాఅభిలాష. ప్రపంచమంతటా విజ్ఞానవేత్తలు నేడు అనేక కొత్తవిషయాలను కనిపెడుతున్నారు. వ్యవసాయంలోను, జీవశాస్త్రంలోను, రసాయనశాస్త్రంలోను, పదార్థ విజ్ఞానశాస్త్రంలోనూ, వైద్యశాస్త్రంలోను సైంటిస్టులు అనేక పరిశోధనలు చేస్తున్నారు. ప్రకృతి గర్భంలో దాగియున్న అనేక రహస్యాలను లోకానికి వెల్లడిస్తున్నారు. వాటిని మానవుల క్షేమం కొరకు వినియోగించుతున్నారు. అలాంటి విషయాలను సేకరించి ప్రకటించాలని మా ఆశయం. రిసెర్చి విద్యార్థులు, సైంటిస్టులు, అనుభవజ్ఞులు తమకుతెలిసిన విషయాలను సులభంగాఅర్థమయేలా వ్రాసి పంపి, యీ శీర్షికను జయప్రదం చేయడానికి సాయపడుతారని ఆశించుతాము. — సం.

బటాటా దుంపలు

బంగాళాదుంపలు మీరంతా ఎరిగే వుంటారు. అవి నీలగిరి, బెంగుళూరు ప్రాంతాలనుండి తెలుగు దేశానికి దిగుమతి అవుతున్నాయి. వీటికి యింకోపేరు ఉర్లగడ్డలు, ఇంగ్లీషులో 'పొటాటో' లంటారు.

ఈ దుంపల జాతికి చెందినదే యింకోటి సెంట్రల్ అమెరికాలో పండించబడుతోంది. దానిని 'బటాటా' దుంపలనిపిలుస్తారు. ఉర్లగడ్డలకంటె యివి నూటికి 60 వంతులు అదనంగా పుష్టికరమైన ఆహారం. వీటినియీమధ్యసోవియట్ యూనియన్‌వారు మధ్య ఆసియా ప్రాంతంలో పంటకుపెట్టారు. అచట చక్కగా పండాయి. అంతేగాక ఉర్లగడ్డలకంటే 4 రెట్లు పండాయట.

మధ్య అమెరికావంటి వేడి దేశంలోను, మధ్య ఆసియా ప్రదేశంలోనుకూడ 'బటాటా' పండించబడుతూంది. ఇవి తెలుగు దేశంలో కూడా పండుతాయేమో పరిశోధన చెయ్యాలి. రైతుసేవకులు దీని విషయమై కృషిచేయాలి.

బంగాళాదుంప ముఖ్యమైన కూరగాను, రుచికరమైనదిగాను ఎంచబడుతూంది. దీన్ని మన భూములలో కూడా పండించ గలిగితే, చౌకగా దొరకుతాయి. ప్రజలందరికి అందుబాటులోకి వస్తాయి. దిగుమతి చేసుకోవలసిన అవసరముండదు.

తీగ మిరప

ఆంధ్రులం విస్తారంగా వాడే వస్తువులలో మిరపకాయ ఒకటి. తెలుగు దేశంలో కొన్ని లక్షల ఎకరాలలో మిరపతోటలు సాగుచేయబడుతున్నాయి. మామూలుగా మిరపతోట్లకు తెగుళ్లు జాస్తి. జాగ్రత్తగా పెంచాలని వుంటుంది. కొలది కాలంలోనే ఉడిగిపోతాయి.

మైసూరు సంస్థానంలో నేకొత్త కొత్తరకం మిరపనుసాగుచేస్తున్నారు. ఇదితీగెవలె ప్రాకుతుంది. ఏడాది పొడుగునా కాస్తుంది. తెగుళ్ళు తక్కువ. బలంచేస్తే, ఏళ్ళతరబడి ప్రతికీ కాస్తుంది. 4-5 ఏళ్ళలో 15 లేక 20 అడుగుల ఎదుగుతుంది. దీనినితోటల్లోవెయ్యొచ్చు. ఇళ్ళదగ్గరఅలంకారం కోసరం వేసినా చక్కగా తీగల్లాగ ఎదుగుతుంది. పెరట్లో వస్తే యింటి గ్రాసానికి పండించుకోవచ్చు. తీగమిరపలో రెండురకాల కాయలున్నాయి. రెండూ మామూలు మిరపకాయలకన్నా కారంగా వుంటాయి. పొడుగుకాయ $1\frac{1}{2}$ అంగుళం దాకా ఉంటుంది. వీటివిత్తనాలను నారుపోసి, 6 వారాలయ్యాక తిరిగినాటాలి. 2 అడుగుంపొడుగు, అదే వెడల్పు, లోతు గల గోతులు తీయాలి. మంచిఎరువుతోనింపి, ఈ మొక్కలనునాటాలి. నాలుగో మాసంనుంచి కాపుదిగుతుంది. ఎరువు వేస్తుంటే, ఎల్లప్పుడూ చక్కగా కాస్తుంది ఈవిత్తనాలు "అసిస్టెంటువ్యవసాయ డిమాన్‌స్ట్రేటరు, హిందూపురం, అనంతపురం జిల్లా," గారివద్దదొరకుతాయి. తెప్పించుకోండి.

నిషేధాజ్ఞను తొలగించాలి

చిట్టివలస జ్యూటు కార్మికసంఘాధ్యక్షులగు కామ్రేడ్ కె. వెంకటేశ్వరరావును, రైతులలోపనిచేస్తున్న కామ్రేడ్ సూరిబాబును, జ్యూటు ఫ్యాక్టరీలో పనిచేసే కామ్రేడ్ టి. అప్పలకొండను, పోలీసులు, యజమానులు, యిచ్చిన రిపోర్టులమీద మద్రాసు ప్రభుత్వము డిటెన్యుచేసింది.

ఆరు నెలలైన తర్వాత వీరి కేసులు రివ్యూ చేయగా, నేరమేమీ కనబడక విడుదల చేయబడ్డారు. అయినా వీరిని విశాఖజిల్లాకురాకుండా నిషేధాజ్ఞ యిచ్చారు. ఇట్టిసంకుచిత చర్యమూలంగా కార్మికులలో నిరుత్సాహము, అధికోత్పత్తికి అడ్డంకులు కలుగుతాయి. కనుక వెంటనే పై ఆర్డరును ఉపసంహరించుకొని, యీ కార్మిక నాయకుల తమ ప్రజలమధ్య పనిచేయుటకు అవకాశం యివ్వాలి.

మహాకవి - మహాపురుషుడు గురజాడ అప్పారావు

(3 వ పేజీ తరువాయి)

మహాపురుషుడు కానివాడు మహాకవి కాలేడేమో! ఆత్మగతం కాని కవిత్వంలో కవి కృత్రిమత్వం తొంగిచూస్తూనే వుంటుంది. ఆత్మ వంచకుడైన యీ కవి తన కృత్రిమత్వాన్ని యితర హంగులతో కప్పిపుచ్చి పరవంచనం చెయ్యలేడు. కొంతకాలం యీ కృత్రిమత్వం సాగవచ్చు, కొందరిని యిది దగా చెయ్యగల సామర్థ్యం సంపాదించవచ్చు, కాని అందరిని కలకాలం దగా చెయ్యలేదు. కనుకనే గెటే, టాల్‌స్టాయ్, షేక్స్పియర్, కాళిదాసు, తిక్కన, పోతన, ఇబ్సన్ మొదలైనవారికి చావులేదు. నవితాంబుగా కొంతకాలం భ్రమపెట్టిన కొందరు కవులు తమరు వింటుకోగా కిందనాయిలు చీపపుబుల్లగా నృష్ట వద్దారు. మహాపురుషుడు కాబట్టే అప్పారావుగారు మహాకవి కాగల్గేరు - ఏ మహదాదర్శానికి తాను త్రికరణశుద్ధిగా దీక్షవహించారో దానికై తమ యావజ్జీవితం నిష్కామంగా ధారపోసిన ధన్యులు.

ఉద్యోగ నిర్వహణ

విద్వద్రాజకవియైన ఆనందగజపతి మహారాజుకు అంతరంగికులు కావడంచేత అప్పారావుగారికి జ్ఞానసముపార్జనం ఒక వ్యసనమై వుండేది. ఆనంద గజపతి మహారాజు ఆస్థానంలో నిరంతరం విద్వద్గోష్ఠి జరుగుతుండేది. అదొక సరస్వతీ నిలయం.

"గ్రీకు, రోమను గ్రంథ పఠనంవల్ల 'రినేజాన్సు' దినములలో యూరపులో అన్ని రాజ్యములలోను స్వదేశీయ సారస్వత విజృంభణము ఉక్కుమీరు వ్రీతిభావంతమైనదికదా. అట్లే ఆంగ్లుల ప్రసిద్ధ సారస్వత ప్రచారం వల్ల అట్టి విజృంభణ మన దేశీయులలో ఆంగ్లమందుగాని, స్వభాషలందుగాని యేల కలుగదాయెను?" అన్న సందేహం అప్పారావుగారిని చాలా రోజులనుండి బాధిస్తుండేది.

లెక్చరరుగా ఉన్నప్పుడు అప్పారావుగారు తామబోధిస్తున్న శాస్త్రానికి, విద్యార్థులకి వన్నె తేవడానికి నిరంతరం కృషిచేసేవారు. చెన్నపట్టణం మొదలైన చోట్లకువెళ్ళి అక్కడి బోధనాపద్ధతులను పరిశీలించేవారు. ఈ విషయంలో వీరి దీక్షను ద్యోతకంచేసే ఘటన యిది.

పరిశోధనపై ఆయనకే సమాధానం స్ఫురించింది :

"ఆంగ్లసాహిత్యపాఠములలో విద్యార్థులకు శైలి (స్టైల్) తోను, వస్తు విన్యాసము (ట్రీట్‌మెంటు) తోను బాగోగులు విడదీసి బోధింపకుండుట, విమర్శగా చదువుట నేర్పకుండుట, స్వతంత్ర యోచనాశక్తిని పురికొల్పునదిగా బోధన క్రమముంతక పోవుట, రసానభవమూ వివేచనాలేకుండుట - ఇవి కారణములుగా ఆంగ్ల సాహిత్య వ్యవసాయము నిష్ఫలమగుచ్చున్నది."

పరిపక్వమైన విమర్శనా కౌశల్యం, గాఢమైన దేశభక్తిలేనివారిని, యిట్టి సంశయం బాధించదు. బాధించినా వారికిటువంటి సమాధానం దొరకదు. మన బానిస విద్యావిధానపు నగ్నస్వరూపం అప్పారాయ మహాకవికి అనాడేగోచరమైంది.

అప్పారావుగారు చరిత్ర పరిశోధన, భాషాశాస్త్రం, నాటకరంగం, మొదలైనవాట్లో విశేష కృషిచేసిన ఆనాటి మహారథులలో ఒకరు. ఆయన రచనలు అధికంగా కాకపోవడానికి, అనారోగ్యంతోబాటు అనేకవిషయాల్లో అప్పారావుగారికి, అనక్తి వుండడం కారణమనుకుంటాను. నూతనశక స్థాపకుడనీ, విప్లవకారకుడనీ ఆయనకు బ్రహ్మరథం పట్టినవారే ఆయన ఆదర్శాలనుండి వీగజారి నవ్య సాహిత్యాన్ని శ్రేయనిమయంగా చేయడానికి, అప్పారావుగారి ఆదర్శాలను సరిగా వంటబట్టించుకోకపోవడమే కారణంకావాలి అప్పారావుగారి రచనలే అధిక సంఖ్యలో వుంటే, అవి వారి చెదినిల్లుకట్టుకొని పోరి పలాయన సాహిత్యానికి ప్రవేశం కలుగకుండా చేసివుండేవేమో? కవిత్వంలో అప్పారావుగారు ప్రవేశపెట్టిన అభ్యుదయ భావాలు కావలసినంతగా అభివృద్ధి కాలేదు. ఇది తెలుగు సాహిత్యంలో విప్లవ ప్రతిఘాతకమైన సంఘటన.

అసమాన శిల్పి

కన్యాశుల్కం, కొండుభట్టీయం చదివిన వారికి అప్పారాయ మహాకవి పాశ్చాత్యనాటక కళను అవగతం చేసుకున్నారని వ్యక్తమవుతుంది. పాశ్చాత్యుల సంస్కృతి యొక్క శిల్పం అప్పారావుగారి రచనలలో, ముఖ్యంగా కన్యాశుల్కంలో ద్యోతకమవుతుంది. ఏమి చిత్రమోగాని, అర్ధశతాబ్దం దాటినప్పటికి, కన్యాశుల్కంతో సరితూగల నాటకం తెలుగులో మరిపుట్టలేదు. పుట్టకపోవడం అప్పారాయ మహాకవి అసమానమైన ప్రతిభను చెపుతుందో, తెలుగువారి నీరస మేధాశక్తిని తెలియజేస్తుందో? అప్పారావుగారి కాలం కన్నా యెంతో అభివృద్ధిచెందిన యీనాడు కూడా, వచనంలోనైతేనేమి, గేయాల్లో నైతేనేమి ఆయన చూపిన శిల్పం, అద్వితీయమై వుందనడం యెంతమాత్రం అతిశయోక్తికాదు.

తెలుగులో కథానికలను మొట్టమొదట అప్పారావుగారే రాసేరు. నాటకాల్లో కన్యాశుల్కంలాగనే, కథానికలలో "మీ పేరేమిటి?" అక్షరాలా సాటిలేనిది. హాస్యరసాన్ని పోషించడంలో ఆయన అందెవేసిన చేయి.

ఆయన శిల్పం అసమానమైనది. సంభాషలు నడిపించడంలో, పాత్ర ఔచిత్యాన్ని మానవ స్వభావాన్ని చిత్రించడంలో ఆయన సిద్ధహస్తుడు. ఒక్క ఉదాహరణతో సంతృప్తి పడతాను: మదాంధుడైన రాజు అంటున్నాడు:

"జౌర చుక్కలనడుమ చందురు
 నట్లు వెలిగెడు కన్నెముందర
 వన్నెకాంచిన నగరిసుందరు
 లందరొక లెక్కా?"

"పట్టవలెరా దీని బలిమిని
 కొట్టవలెరా మనసిరాజ్యం
 కట్టవలెరా గండపెండెం
 రసికమండలిలో?"

వాడిబారికి గురియైన కన్యక అంటుంది:

"పట్టపగలే, నట్టివీధిని
 పట్టబోరే జారచోరులు
 పట్టదలచితివింక నీవొక
 పట్టమేలేరాజువట?"

"కండకావరమెక్కి నీవీ
 దుండగము తలపెట్టినందుకు
 వుండదా ఒక దైవమంటూ
 వుంది పూర్కొనునా?"

("కన్యక")

సహృదయులకు వ్యాఖ్య అనవసరమనుకుంటాను.

వీరేశలింగంగారిని, అప్పారావుగారిని పోల్చిచూడాలంటే — ఒకరు సాంఘిక విప్లవకారులై సారస్వతాన్ని ఆయుధంగావట్టి నూతనశకాన్ని స్థాపించిన యుగపురుషుడు. ఇంకొకరు సాహిత్య విప్లవకారకులై నూతన సంస్కృతిని నెలకొల్పిన మహాపురుషుడు.

"ఈతని (అప్పారావుగారు) కావ్యములు పాత్రములు, ఒక సహజభావోద్రేకముతో ఈతనివలెనే, కావ్యౌచిత్యమును కుంటువడక మెరుగు దేరునట్లు సంస్కారాశయములను వెలిపుచ్చును."

(ఆంధ్రవిజ్ఞానసర్వములో కొం. జనార్దనరావు)

ఈ విశిష్టతనే ఉత్సాహవంతులైన నేటి యువకరచయితలు అప్పారాయ మహాకవి నుండి అలవర్చుకోవాలి. ఆయనభాష భావాలు శిల్పం తెలుగువారి పెన్నిధులు - యివి అప్పారాయ మహాకవికి విశ్వసాహిత్యంలో గౌరవస్థానం సంపాదించేయి. ఆయన ప్రబోధించిన మహాదాదర్శాలు ఫలవంతంగా ఆచరణలో పెట్టిననాడే తెలుగుజాతి ఆయనను గౌరవించి కృతజ్ఞతను చూపినదవుతుంది.

గురజాడ అప్పారావు జీవిత విశేషాలు

- విశాఖజిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో 1861 లో (దుందుభి నామసంవత్సర శుద్ధత్రయోదశి) మహాకవి జననం.
- చీపురుపల్లిలో విద్యాభ్యాసం.
- తరువాత విజయనగరం కళాశాలలో విద్యాభ్యాసం సాగించి, పట్టభద్రులయ్యారు.
- 1887 నుండి 1896 వరకూ విజయనగరం కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు.
- 1896 నుండి 1913 వరకూ - అంటే రిటైరయ్యేవరకూ, విజయనగర ఆస్థానపు ఎపిగ్రాఫిస్టుగా పనిచేశారు.
- 1910-11 ఆంధ్రపత్రికలలో బిల్హణీయం అన్న నాటకాన్ని ప్రచురించారు.
- 1910 ముత్యాలసరాల కూర్పు.
- 1913 మద్రాసు యూనివర్సిటీ సెనేటు యావజ్జీవిత సభ్యుడుగా ప్రభుత్వం నియమించింది.
- 1915 నవంబరు 30 న కీర్తిశేషులయ్యారు.

సర్వత్రా విజయం మిత్రరాజ్యాలకే

ఊపిరిపంది ఒక్కసారి తుపానులా, సోవియటు సేనలు తూర్పుప్రష్యాపై విరుచుకుపడ్డాయి. 30 మైళ్ళ జర్మను శ్రేణిని అప్పుడే ఛిన్నభిన్నం చేశాయి. ఒకచోట 20 మైళ్ళ లోపలికి చొచ్చుకు పోయాయి.

ఇతర రంగాలలో కూడ సోవియటు అఖండవిజయాలనే సాధించుతోంది. ఫిన్లండులో ఉత్తరభాగాన నార్వే సరిహద్దుకు సోవియటు సేనలు చేరాయి. హంగరీలో రెడ్‌ఆర్మీ ధాటికి ఫాసిస్టులు తట్టుకోలేకపోతున్నారు. డెబ్రిజన్ అనే కీలకనగరం రెడ్ ఆర్మీ వశమయింది. రాజధానీ నగరం బుడాపెస్టులో, సాయుధ కార్మికులు ఫేసిస్టులతో పోరాడుతున్నారు. 1918 లో హంగరీలో కార్మిక విప్లవాన్ని అణచివేసిన హోర్తీయే తిరిగిపోయాడంటే, ఇక హిట్లరుగతి ఎలా ఉంటుందో వేరెచెప్పాలా? ఫేసిస్టులు అతని వద్దనుండి అధికారాన్ని లాగివేశారు. అయినా బుడాపెస్టుకు విముక్తి ఇంకెన్నాళ్లో పట్టదు.

యుగోస్లావియాయొక్క రాజధానీ నగరం బెల్గ్రేడ్‌కు శత్రుదాస్యం తప్పింది. మార్షల్‌టిటో దేశభక్త సైన్యాల సహాయంతో రెడ్‌ఆర్మీ బెల్గ్రేడ్‌ను శత్రువుల చెరనుండి తప్పించింది. ఇక బెల్గ్రేడ్ నుండి ఆస్ట్రియాకు నిరాఘాటంగా రెడ్‌ఆర్మీ ముందుకు పోవచ్చు.

జెకోస్లొవేకియాలో రెడ్‌ఆర్మీ మరొకదండయాత్రను ప్రారంభించింది. 175 మైళ్ల పొడవుగల రంగంలో విజృంభించి, 6 కార్పేథియన్ కనుమదారులను పట్టుకొంది. ఛాంబర్లేను ప్రభృతుల మ్యూనిక్ ద్రోహఫలితంగా బలియైన జెకోస్లొవేకియాకు రెడ్‌ఆర్మీదాస్యవిమోచనం కలుగజేస్తోంది. ఇతరరాజ్యాలు హిట్లరుకు సంతృప్తిపరచే ఆరోజుల్లోకూడా ఒంటరిగా జెకోస్లోవేకియాపక్షాన నిలచింది సోవియట్ యూనియన్ ఒక్కటే.

గ్రీసులో ఏథెన్సు విముక్తి అయాక మరి 100 మైళ్ళు ముందుకు పోయాయి మిత్రసేనలు. ఏథెన్సులో అప్పుడే ప్రజామంత్రివర్గం కూడా ప్రవేశించింది.

పశ్చిమరంగాన, ఆకెన్ (జర్మనీ లోపల ఒకపట్టణం) అమెరికాసేనల వశమయింది. బ్రిటిష్—కెనేడియన్ సేనలు డచ్ - బెల్జియం కోస్తాలో క్రమక్రమంగా విజయాలనుసాధించుతున్నాయి.

హిట్లర్ - హిమ్లర్ ప్రకటనలు

ఈవిధంగాతరుసగా అపజయాలను పొందుతున్న హిట్లరు, క్రూరాతిక్రూరుడూ - మాఫియా గాఢాత్ముడూ అయిన హిమ్లర్ నాయకత్వాన "ప్రజాసైన్యం" అంటూ ఏర్పరిచాడు. 16-60 ఏండ్లమధ్య జర్మను ప్రజలంతా దీనిలో ఉంటారు. జర్మనీలోకి చొచ్చుకువచ్చే మిత్రసేనలను రక్తం ధారపోసి, దేహాలొడ్డి ప్రతిఘటిస్తాయట ఈ సేనలు! హిమ్లరు ఉపన్యాససారం ఇదే. కాని ఈ ప్రగల్భాలకు అర్థం వది, బ్రిటను అమెరికాలలోని అభివృద్ధి నిరోధకులు సంధిరాయబారాలకు ప్రోత్సహిస్తారేమోనని వీరి ఆశ. కాని వారి ఆశలు అడియాసలవుతాయి.

జర్మనీపై కలిసి దెబ్బతీయడంలోను, యుద్ధ విరామసంధి విషయంలోను, జర్మను యుద్ధనేరస్థులను శిక్షించడంలోను, కూడా మిత్రరాజ్యాలన్నీ ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈమధ్య అన్ని విషయాలలోను చర్చిల్ - స్టాలిన్‌లు ఏకాభిప్రాయానికి రావడం మరింత గమనించదగింది. నాజీ హంతకులకిక బ్రతికి బయటపడే అవకాశం ఏమాత్రమూ లేదు.

ప్రాచ్యరంగం

బర్మాలో టిడ్డిం మనవాళ్ళ వశమయింది. ఫిలిప్పైన్సులో లేటి ద్వీపంపై జనరల్ మెకార్థర్ సేనలు దండయాత్ర ప్రారంభించాయి. ఫిలిప్పైన్సు దీవులు మంచి కీలక స్థానంలో వున్నాయి. అవి మిత్రసేనల వశమయాయంటే, జపానుకు తుది ఘడియలు ఆసన్నమవడం అన్నమాటే. ఫిలిప్పైన్సులోని నౌకా విమానాశ్రయాలను ఆధారంచేసుకొని, మున్ముందు జపానుపై దండయాత్ర సలపడం సులభం. ఇంతేకాదు, జపానుకూ, అది జయించిన బర్మా, మలయా, డచ్చి ఈస్టిండీస్ మొదలగువాటికి సంబంధంలేకుండా తెగిపోతుంది. అందుచే ఫిలిప్పైన్సుయుద్ధంతో పసిఫిక్‌రంగ పోరాటం మరొక ఘట్టంలో ప్రవేశించింది. జపాను ఫాసిస్టులకు మరొక సమ్మెటపోటు తగిలింది.

— తుమ్మల వెంకటరామయ్య
24-10-44.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE